## సరిహద్దుల్లో త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక వ్యవస్థ

జోధ్‌పూర్ : సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాజస్థాన్‌లో జోధ్‌పూర్ లోని బీఎసఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నిర్వహించిన బీఎసఎ ఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేజర్ యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం మంచి ఫలితాలు ఇచ్చిందని, దీని వల్ల పంజాబ్‌లో పాకిస్థాన్‌తో సరిహద్దు ప్రాంతంలో శత్రు డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతలు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని అన్నారు. రాబోయే రోజుల్లో శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు మరింత పెరగనుందని, దాన్ని ఎదుర్కొనేందుకు బీఎసఎఫలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని తీసుకురానున్నట్లు అమిత్ షా వెల్లడించారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 351 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 జనవరి 2025 శనివారం పేజీలు : 4



# అర్హులకే రైతు భరోసా!

## 26 నుంచి జిల్లాలకు వస్తా!

### ప్రభుత్వ పథకాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: జనవరి 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్ధేశం చేశారు. సచివాలయంలో కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం ముగిసింది. కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అంత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు.

## రేవంత్ ఫ్యూచర్ ప్లాన్ ఆవిష్కరణ - కీలక హామీ..!!



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోర్త్ సిటీ భవిష్యత్ ను ఆవిష్కరించారు. పారిశ్రామిక వేత్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణ ఆర్ధిక వ్యవస్థ...భవిష్యత్ లో భాగస్వాములు అయ్యేందుకు కలిసి రావాలని ఆహ్వానించారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. దేశం లోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ నిలుస్తుందని రేవంత్ విశ్వాసం వ్యక్తం చేసారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామ ని వెల్లడించారు.

**ఇదీ మా లక్ష్యం...** సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన చేసారు. హైదరాబాద్ లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేసారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళు న్నామని వివరించారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుం దని ఆసక్తికర విశ్లేషణ చేసారు.

ఈ నగరంలో ఇందులో సేవారంగం మాత్రమే ఉంటుందని వెల్ల డించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

**స్పష్టమైన విజన్...** కొత్తగా ఆర్టీసీలోకి 3,200 ఈవీ బస్సులను తీసుకువస్తున్నామని రేవంత్ పేర్కొన్నారు. దేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా తెలంగాణలో అమ్ముడవుతున్నాయని వివరించారు. రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడుస్తోందని..తమకు రాష్ట్ర భవిష్యత్ పై ఒక విజన్ ఉందని వెల్లడించారు. అదే తెలంగాణ రైజింగ్ అని ఉద్ఘాటించారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొవడానికి హైదరాబాద్ సిద్ధమ వుతోందని వివరించారు. వరదలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనుకుంటున్నామని చెప్పారు. మూసీ పునరుజ్జీవనంతో 55 కిలోమీటర్ల వరకు తాగునీటితో ప్రవహించేలా చేయనున్నా మని చెప్పారు. 2050 సంవత్సరానికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు కావాల్సిన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించామని వివరించారు.

**ఇదీ ప్రణాళిక...** రీజినల్ రింగ్ రోడ్ ప్రణాళికల దశలో ఉందని తెలిపారు. 360 కి.మీ పొడవు రీజినల్ రింగ్ రోడ్‌ను నిర్మిస్తున్నామని.. దాని చుట్టూ రీజినల్ రింగ్ రైల్వేను ప్లాన్ చేస్తున్నామని సీఎం రేవంత్ సమా వేశం లో వివరించారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ లను అనుసంధానించే రేడియల్ రోడ్లు కూడా నిర్మించబోతున్నామని ప్రకటించారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీలు, సోలార్ వంటి పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు కాబోతున్నాయని తెలిపారు. స్కిల్స్, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించామని అన్నారు. అవుటర్ రింగ్ రోడ్ బయట ఉన్న గ్రామీణ తెలంగాణలో వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగుల వంటి పైన దృష్టి పెడతామని చెప్పారు. ఏపీలోని బందర్ ఓడరేవుతో అనుసంధానం చేస్తూ ప్రత్యేక రహదారితో పాటు రైల్వే కనెక్షన్ ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలని , మార్కెట్లు స్వేచ్ఛగా పనిచేయాలని తాము కోరుకుంటున్నామని ...తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమతో కలిసి రావాలని కోరారు.




## కేటీఆర్‌పై మరో కేసు నమోదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం ఏసీబీ విచారణ అనంతరం బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం వరకు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేటీఆర్ తోపాటు గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్, మున్నె గోవర్ధన్, క్రిశాంక్, జైసింహ, తదితరులపై 305, %తీ/ష% 62 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా, ఫార్ములా ఈ రేస్ కేసులో గురువారం కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు దాదాపు 7 గంటలపాటు విచారించారు. విచారణ అనంతరం ఏసీబీ ఆఫీసు నుంచి బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ ఆఫీస్ వరకు కేటీఆర్ ర్యాలీగా వెళ్లారు. అయితే, అనుమతి లేకుండా ర్యాలీ తీసి వాహనదారులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించినందుకు కేటీఆర్‌పై ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారు. మరోవైపు, గురువారం విచారణ అనంతరం బయటకు వచ్చిన కేటీఆర్ ఏసీబీ ఆఫీస్ దగ్గర మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ అడ్డుకున్నారు. ఇక్కడ మాట్లాడొద్దని.. పార్టీ ఆఫీసుకు వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడుకోవాలని కేటీఆర్‌కు ఆయన సూచించారు. దీంతో మీడియాతో మాట్లాడితే మీకెందుకు భయపమంటూ డీసీపీపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత అక్కడ్నుంచి తెలంగాణ భవన్‌కు వెళ్లిపోయారు. ఇది ఇలావుండగా, ఏసీబీ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఏసీబీ అధికారులు అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడిగారని.. అలా 82 ప్రశ్నలు అడిగారని చెప్పారు. రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు కేసు పెట్టించారని ఏసీబీ అధికారులకు కూడా అర్థమైందన్నారు. కేసులో ఎలాంటి విషయం లేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఫార్ములా ఈ రేస్ అనేదాన్ని తొలిసారి ఇండియాకు తీసుకొచ్చామని కేటీఆర్ తెలిపారు.

హైదరాబాద్‌లో కొనసాగించాలని భావించామన్నారు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే తెలంగాణకు భవిష్యత్తులో ఈవీ రంగంలో పెట్టుబడులు వస్తాయనే సదుద్దేశంతో పనిచేశామని తెలిపారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో ఎలాంటి అవినీతి లేదని.. అవినీతి పనులు తాము చేయమని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు విచారణకు పిలిచినా తప్పకుండా వస్తానని తెలిపారు. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని ఏసీబీ అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. ఇలాంటివి మరో వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటామన్నారు. తమపై ఎవరెన్ని కుట్రలు చేసినా.. ఎన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసినా ఈ ఏడాదంతా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూనే ఉంటామని కేటీఆర్ చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నేతృత్వంలో ఎంతో నిబద్ధతతో, ఎక్కడా అవినీతి లేకుండా పనిచేశామని చెప్పారు.

## భారీగా నిధులు విడుదల

హైదరాబాద్ / అమరావతి : దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పన్నుల్లో వాటా కింద శుక్రవారం రాష్ట్రాలకు నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.1,73,030 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.7002 కోట్లు, తెలంగాణకు రూ.3,637 కోట్లు విడుదల చేసింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొంది. ఇదిలా ఉండగా.. నిధుల కేటాయింపుపై తెలంగాణ ప్రభుత్వం అసహనంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించి.. అందులో సగం కూడా తెలంగాణకు కేటాయించకపోవడంపై సీఎం సహా మంత్రులు కూడా మండిపడుతున్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి కూడా తెలంగాణ పట్ల కేంద్రం చిన్నచూపు చూస్తోందని కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. 'రాబోయే పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాల మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి, వారి అభివృద్ధి/సంక్షేమ సంబంధిత వ్యయాలకు ఆర్థిక సహాయం కోసం విడుదలు చేస్తున్నాం' అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.



# సంపాదకీయం

## మళ్లీ స్థానిక ఎన్నికలపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికలపై మళ్లీ రాజకీయ చర్చ మొదలైంది. త్వరలోనే ఎన్నికలు ఉంటాయంటూ కాంగ్రెస్ పీఏసీ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా కామెంట్ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఇప్పటికే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురుచూస్తోంది. వాస్తవానికి సంక్రాంతి పండుగ నాటికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, 15, 20 రోజుల్లోనే మొదట జీపీ, ఆ తర్వాత మండల ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహాగానాలు గతంలోనే వచ్చాయి. తాజాగా ఈ నెలాఖరులోగా రైతు భరోసా, ఇందిరమ్మ రైతు కూలీ భరోసా చెల్లింపు మొదలుపెట్టాక, ఎన్నికల షెడ్యూల్ ఇస్తే మంచిదనే సూచనలు అధికారపార్టీకి అందినట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి మొదటివారంలోగా నోటిఫికేషన్ ఇచ్చి రెండువారాల్లో ఒక ఎన్నిక, మరో వారం, పదిరోజుల గడువు ఇచ్చి మరో ఎన్నిక పూర్తి చేస్తే అన్నివిధాలా బావుంటుందనే అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది. మార్చి నెలలో ఇంటర్, టెన్త్ పరీక్షలు ఉన్నందున అంతకు ముందే ఎన్నికలు జరిపితే మంచిదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఫిబ్రవరిలోనే మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున, పనిలో పనిగా స్థానిక ఎన్నికలు కూడా నిర్వహిస్తే మంచిదని భావిస్తున్నారు. ముందుగా పంచాయతీల ఎన్నికలు, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఫిబ్రవరిలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, ఆయా శాఖలకు సంబంధించి బడ్జెట్ నిధుల వ్యయం పూర్తిచేయాల్సి ఉన్నందున, వేసవి ముగిశాక లేదా మేలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశం కూడా లేకపోలేదని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై....** కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంపుదలపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే పూర్తయ్యింది. దీనికి సంబంధించిన నివేదికను ఇంకా ప్రభుత్వం విడుదల చేయలేదు. ఆయా అంశాలపై పరిశీలన చేపట్టిన డెడికేటెడ్ కమిషన్ బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే దానిపై ఇంకా నివేదికను సమర్పించలేదు.


దీనిని పరిశీ లించాక ఎంతశాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీకి పంపిం చనుంది. ఈ ఉత్తర్వులు అందిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తుంది.

# రత్నాలయ శ్రీవెంకన్నను దర్శించుకున్న భక్తజనం

**ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వెంకన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు**

**అలియాబాద్ రత్నాలయంలో ఉత్తర ద్వారం ద్వార కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి**

**దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన వేలాది మంది భక్తులు**







శామీర్ పేట, (గరుడ వార్త) : ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి) పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం అలియాబాద్ రత్నాలయ శ్రీ వెంకటేశ్వర స్వామిని వేలాదిగా భక్తజనంఉత్తర ద్వారం గుండా భక్తి శ్రద్ధలతో దర్శించుకొని తరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలియాబాద్ చౌరస్తా సమీపంలోని రత్నాలయం వేలాది మంది భక్తులతో బారులు తీరింది. రత్నాలయంలోకి ఉదయం 4గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వేల మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వారం ద్వార రత్నాలయంలోకి ప్రవేశించి కలియుగదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకుని అర్చన, ప్రత్యేక పూజలను చేశారు. అలాగే అలియాబాద్ చౌరస్తా సమీపంలోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో, తూంకుంటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో, దేవరయంజాల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, తూముకుంటలోని శ్రీగాయత్రి మహాక్షేత్రం, అలియాబాద్లోని శ్రీసీతారామచంద్రస్వామి, దేవరయాంజాల్లోని శ్రీసీతారామచంద్రస్వామిని, శామీర్ పేటలోని శ్రీభవాణిరామ లింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణస్వామిలకు, శ్రీభవాణిరామలింగేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. మురహరి పల్లి పరిధిలోని శ్రీ హరిహర దేవాలయం, కేశవరం శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి, మూడు చింతలపల్లి లోని శ్రీహరిహర దేవాలయం, ఉద్దమర్రి లోని శ్రీ విష్ణు శివాలయాలలో వేలాది మంది భక్తులు విచ్చేసి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి శ్రీవేంకటేశ్వరస్వామి వారిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని పూజలను చేశారు. కాగా ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సవాలతో భక్తులు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శిం చుకుని, కొలుస్తు ముక్కోటి పర్వదినం జరుపుకున్నారు

# ఐ ఎఫ్ టి యు విలీన సభను తప్పక సమిష్టిగా ముందుకు వచ్చి జయప్రదం చేయాలి....




శామీర్ పేట, (గరుడ వార్త) : ఐ ఎఫ్ టి యు విలీన సభను తప్పక జయప్రదం చేయాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శివబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రం శామీర్ పేటలో తూంకుంట మున్సిపల్ వార్డు కార్యాలయం వద్ద ఐ ఎఫ్ టి యుయూనియన్ విలీన సభ వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివ బాబు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీ కరణ విధానాలను ప్రతిఘటిద్దామని, ప్రభుత్వ రంగ పరిరక్షణ కై ఉద్యమిద్దామన్నారు. బలమైన విప్లవ కార్మికోద్యమ నిర్మాణం, విస్తరణ కై ఐ ఎఫ్ టి యు ను విలీనం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విలీన సభను ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తగూడెం క్లబ్ లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి కార్మికులందరూ అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశానికి ఐ ఎఫ్ టి యు జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ సాదినేని వేంకటేశ్వర రావు, ఉపాధ్యక్షుడు బి. ప్రదీప్ లు విచ్చేస్తున్నారని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మండల నాయకులు నాగరాజు, స్వామి, బల్ నరసింహ, కమలమ్మ, సుగున, పోచయ్య, కిష్టయ్య, వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

# ఎల్లంపల్లి ఎడమ కాలువపై నిర్లక్ష్యం



మల్యాల : ఎల్లంపల్లి జలాలను గంగాధర మండలంలోని నారాయణపూర్ ప్రాజెక్టు ద్వారా మల్యాల మండలంలోని గ్రామాలకు తరలించేందుకు 10 ఏళ్ల కిందట చేపట్టిన ఎల్లంపల్లి ఎడమ కాలువ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. నారాయణపూర్ ప్రాజెక్టు నీటిని మల్యాల మండలంలోని బల్వంతాపూర్, ముత్యంపేట, గుడిపేట, పోతారం, ఓబులాపూర్, అంతర్గాం గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు అందించేందుకు దాదాపు 20 కి.మీ కాలువ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. రెవెన్యూ అధికారులు భూసేకరణ చేపట్టగా పలు గ్రామాల రైతులు వ్యతిరేకించి అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. గంగాధర మండలంలోని నారాయణపూర్ నుంచి మల్యాల మండలంలోని బల్వంతాపూర్ శివారు వరకు భూసేకరణ చేపట్టి నిర్వాసితులకు పరిహారం కూడా అందజేశారు. నీటిపారుదల శాఖ అధికారులు కాలువ నిర్మాణంతోపాటు కొంత దూరం లైనింగు పనులు కూడా పూర్తి చేశారు. దాదాపు 8 ఏళ్ల కిందట బల్వంతాపూర్ శివారు వరకు కాలువ నిర్మాణంతోపాటు లైనింగు పనులు కూడా పూర్తి చేసినప్పటికీ ముందుకు సాగలేదు. బల్వంతాపూర్ శివారులోని వైకుంఠధామం పక్కనుంచి వెళ్లే కాలువ నిర్మాణ పనులను నిలిపివేయడంతో దట్టంగా చెట్లు పెరిగాయి. ఈ విషయమై తహసీల్దారు మునిందర్‌ను సంప్రదించగా ఎల్లంపల్లి ఎడమ కాలువ నిర్మాణ పనుల వివరాల తెలియదని, నీటిపారుదల, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు చూసుకుంటారని వివరించారు. ఇరిగేషన్‌శాఖ డీఈ తిరుపతిని వివరణ కోరగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణ పనుల గురించి తనకు కూడా తెలియదని ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులే చూసుకుంటారని తెలిపారు.

# అంతస్తులు ఇంతింతై..!

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. కొందరు అనుమతుల్లేకుండానే భారీ భవంతులు నిర్మిస్తుండగా.. కొందరు స్థానిక మున్సిపాలిటీల నుంచి అయిదు అంతస్తులకు అనుమతులు తీసుకొని 7-8 అంతస్తులపైనే నిర్మిస్తున్నారు. శంకర్‌పల్లి, శంషాబాద్ జోన్ల పరిధిలో ఎక్కువ శాతం ఇలాంటి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. గతంలో వివిధ ప్రాంతాల్లో 600 వరకు అలాంటి హెచ్ఎండీఏ విజిలెన్సు విభాగం గుర్తించింది. అందులో 200 భవనాలను పాక్షికంగా కూల్చారు. తర్వాత అధికారులు శీతకన్ను వేయడంతో మళ్లీ అక్రమ నిర్మాణాలు జోరు సాగుతోంది. కూల్చిన భవనాలను కొందరు మరమ్మతులు చేసి మళ్లీ యధావిధిగా పూర్తి చేశారు.

**అయిదంతస్తులకు మించితే...**

హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, సిద్దిపేట పరిధిలో 1000 చదరపు మీటర్లలో 5 అంతస్తులకు మించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలంటే బల్దియా లేదా హెచ్ఎండీఏ అనుమతులు తీసుకోవాలి. శివార్లలో ఐటీ ఇతర పరిశ్రమలు విస్తరిస్తుండటంతో అక్కడ అద్దె



ఇళ్లకు మంచి డిమాండ్ ఉంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని చాలామంది అక్రమంగా అంతస్తులు నిర్మిస్తున్నారు. నార్సింగి, కొత్వాల్ గూడ, పుప్పాలగూడ, శంషాబాద్ ప్రాంతాల్లో అక్రమ భవంతులు పుట్టగొడుల్లా వెలస్తున్నాయి. అక్రమ భవనాలు గుర్తించడం తప్ప.. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం హెచ్ఎండీఏకు లేదు. దీంతో స్థానిక మున్సిపాలిటీలకు ఆ పనులు అప్పగిస్తున్నా.. వారేమీ పట్టించుకోవడం లేదు.

**ఆదాయానికి భారీగా గండి**

అక్రమ భవనాలతో ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండిపడుతోంది. లేఅవుట్లు, భవనాల అనుమతుల ఫీజుల రూపంలో హెచ్ఎండీఏకు రూ.1000 కోట్లు నుంచి రూ.1200 కోట్లు వరకు ఆదాయం సమకూరుతోంది. అయితే పకడ్బందీ చర్యలు తీసుకుంటే ఈ ఆదాయం రూ.2 వేల కోట్లకు చేరనుందని అంచనా. గతంలో హెచ్ఎండీఏ గుర్తించిన 600 అక్రమ భవనాల ద్వారా దాదాపు రూ.100- రూ.150 కోట్లు ఫీజుల రూపంలో హెచ్ఎండీఏ ఆదాయం కోల్పోయింది. ఇది ఒక ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో గుర్తించినవి మాత్రమే. గత కొన్నాళ్లు అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండీఏ గప్‌చుప్‌గా ఉంటోంది. స్థానిక మున్సిపాలిటీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఫ్లోర్‌కు లక్ష వంతు వసూలు చేసి చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ భవనాలకు నివాస యోగ్య పత్రం(ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) నిలుపుదల చేసే అధికారం ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఓసీ లేకుండానే విక్రయించి చేతులు దులుపుకొంటున్నారు.

# ఎర్రమట్టి తవ్వకాలకు అడ్డేలేదు!

తాండూరు : జిల్లాలో ఎర్రమట్టి తవ్వకాలు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే గుట్టుగా సాగుతున్నాయి. అంతేకాదు నిబంధనలకు విరుద్ధంగా తవ్వేస్తుండటంతో పరిసరాల్లోని ప్రజోపయోగ భవనాలకు ముప్పు వాటిల్లుతోంది. వృక్షాలను సైతం యథేచ్ఛగా నరికివేస్తున్నారు. దీంతో పర్యావరణానికి చేటు కలుగుతోంది. కళ్లముందు ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

వేర్లతో సహా పెకిలించేశారు

తాండూరు మండలం అంతారం వద్ద రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు. మరో రూ.2కోట్లతో ఆడిటోరియం నిర్మించారు. వీటి వెనుకే ప్రభుత్వ భూమిలోని గుట్టలను అమాంతం తవ్వేశారు. దీంతో పది అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. ఇండోర్ స్టేడియం ఆనుకొని తవ్వకాలు చేపట్టడంతో భవిష్యత్తులో వర్షాలు కురిస్తే పునాదులు కూరుకుపోయి భవనం కుప్పకూలే ప్రమాదముంది. వీటి పక్కనే ఎకరాలో బంజారాభవన్ నిర్మిస్తున్నారు. గుంతలతో భవనం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మట్టి తవ్వకాలతో గుట్టపైన పదులసంఖ్యలో పచ్చని చెట్లు దెబ్బతిన్నాయి. వేర్లతో సహా పెకిలించడంతో కొన్ని నేలకొరిగాయి. మరికొన్ని జాడలేకుండాపోయాయి. అక్రమ తవ్వకందారుల కార్యకలాపాలతో సహజ సంపదకు ఆపద



నెలకొంది. ఇదంతా సంగారెడ్డి, జహీరాబాద్ రహదారుల పక్కనే జరుగుతున్నా అధికారులు మిన్నకుండిపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**వారం క్రితం అడ్డగింత..**

వారం క్రితం అంతారం గ్రామస్థులు మట్టి తరలింపును అడ్డుకున్నారు. దీంతో నాలుగైదు రోజులు తవ్వకాలు ఆగిపోయాయి. ఇటీవల మళ్లీ కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి చేటు తెచ్చేలా పనిచేస్తున్న వారిపై రెవెన్యూ, గనులు, అటవి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ పనుల పేరిట..**

రైల్వే, తారు రహదారుల పనుల పేరిట కొందరు ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అభివృద్ధి పనులకు మట్టి తరలించినప్పటికీ చెట్లు దెబ్బతినకుండా, స్థానికులు, పరిసరాల్లోని పంట పొలాల రైతులకు ఇబ్బంది కల్గకుండా తక్కువ లోతు వరకు తరలిస్తే సమస్య ఉండదు. కానీ అడుగుల లోతున ప్రజోపయోగ భవనాల పక్కనే తవ్వడంతో భవనాల పునాదులు కూలే ముప్పు తెచ్చిపెడుతున్నారు.

## 16,500 ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు

మణుగూరు : సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అశ్వాపురం మండలంలోని 16,500 ఎకరాల ఆయకట్టుకు అందించేందుకు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. ప్రాజెక్టు ప్రధాన కాలువపై 9.70 కి.మీటరు వద్ద రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు ప్రారంభించారు. 2023 జనవరిలోనే దీనికి శంకుస్థాపన చేసినా రెండేళ్లుగా తట్టెడు మట్టిని కూడా తవ్వింది లేదు. ఇటీవల పనులు మొదలుపెట్టారు. మరో వైపు ఆయకట్టు విస్తీర్ణం, కాలువల అలైన్‌మెంట్లపై సర్వేలు జరుపుతున్నారు.

**రూ.97 కోట్లతో..**

ఎత్తిపోతల నుంచి గొందిగూడెం ఇసుక వాగు 2కి.మీ. దూరం ఉంటుంది. అక్కడి వరకు పైపులైన్ నిర్మిస్తారు. అక్కడ 90 మీటర్ల ఎలివేషన్ పాయింట్‌లో ఎడమ, కుడి కాల్వలతో కూడిన డెలీవరీ సిస్టర్న్ ఏర్పాటుచేయనున్నారు. ఎడమ కాల్వను ఇసుక వాగుకు అనుసంధానిస్తారు. ఇసుక వాగు నుంచి గోదావరి జలాలు తుమ్మల



చెరువుకు చేరుకుంటాయి. తుమ్మలచెరువు కింద 5వేల ఎకరాలకు ఏడాదికి రెండు పంటలకు గోదావరి జలాలు అందుతాయి. అదే పాయింట్ నుంచి కుడికాల్వ అశ్వాపురం వైపు మణుగూరు రైల్వేమార్గానికి సమాంతరంగా 9.60కి.మీ. దూరం సాగుతుంది. చింతలచెరువు, జగ్గారంలోని ఎర్రబొక్కలచెరువు, మిట్టగూడెంలోని తీగలచెరువులతో అనుసంధానమవుతుంది. కాల్వ ద్వారా వాటిల్లోకి గోదావరి జలాలు తరలించనున్నారు. వాటికింద సుమారు 11,500 ఎకరాలకు నీరందుతుంది. ఇందుకు రూ.97కోట్లు వెచ్చించ నున్నారు. కాల్వలతవ్వకం, పంపిణీ వ్యవస్థల దాదాపు 250ఎకరాలు అవసరమ వుతాయి.

**ఆ తరువాతే మారెళ్లపాడు ప్రణాళిక..**

రైల్వేమార్గం ఆవల గొందిగూడెం, కొత్తూరు, ఎలకలగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 3 వేల ఎకరాలు సాగవుతున్నాయి. 30 వరకు కుంటలు, అయిదు పెద్ద చెరువులు ఉంటాయి. వాటికి కూడా గోదావరి జలాలను అందించే ప్రణాళిక ఉంది. అయితే అటువైపు గోదావరి జలాలు తరలించాలంటే రైల్వేమార్గం దాటాలి. అందుకు రైల్వేశాఖ అనుమతి కావాలి. ప్రస్తుతానికి ఆ ప్రణాళికను వాయిదా వేశారు. తొలుత 5వేల ఎకరాల తుమ్మలచెరువు ఆయకట్టుకు, 11,500 ఎకరాల అశ్వాపురం, జగ్గారం, మిట్టగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ఆయకట్టుకు గోదావరి జలాలను అందించిన తరువాత మారెళ్లపాడు ప్రణాళికపై దృష్టి సారించనున్నారు.

**ఏప్రిల్ నెలాఖరు వరకు.. శ్రీనివాస్, డీఈ, జలవనరులశాఖ**

ఏప్రిల్ నెలాఖరు వరకు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తిచేసి తుమ్మలచెరువు ఆయకట్టుకు గోదావరి జలాలను అందించేందుకు ప్రయత్నిస్తాం. తరువాత అశ్వాపురం, జగ్గారం, మిట్టగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులకు గోదావరి జలాలు అందిస్తాం. ఇవి పూర్తయిన తరువాత మారెళ్లపాడు ప్రణాళిక గురించి ఆలోచిస్తాం.

## దంత సేవలు అంతం

ఖమ్మం : మానవ శరీరంలో ముఖ్యమైన దంతాలకు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తీసుకునే ఆహార పదార్థాలు, అపరిశుభ్రత, బ్యాక్టీరియాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఆరోగ్యకరమైన జీవనశైలితో దీన్ని అధిగమించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా దంత సంరక్షణపై నిర్లక్ష్యం నెలకొని అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యసేవల్లో ఈ విభాగానికి ప్రాధాన్యం పెరిగింది. ఖమ్మం సర్వజనాసుపత్రి దంత విభాగానికి వందల సంఖ్యలో రోగులు రకరకాల సమస్యలతో వస్తున్నారు. ఇక్కడ రోగులకు సాధారణ చికిత్సలు మాత్రమే లభిస్తున్నాయి. ఇందుకు ఆధునిక పరికరాలు, నిపుణుల కొరత కారణమని తెలుస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి దంతచికిత్సల విభాగాన్ని పటిష్ఠపరిస్తే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

**సమస్యలు అనేకం..**

దంతాలు రాలడం, రంగు మారడం, పగలడం, దంతాలు కట్టించుకోవడం, దుర్వాసన, నరాలు, చిగుళ్ల వాపు, వయసు పెరిగిన వారిలో గింజల వ్యాధి, ప్రమాదాల బారిన పడినప్పుడు దవడలు విరగడం తదితర కారణాలతో రోగులు సర్వజనాస్పత్రిని నమ్ముకొని వస్తున్నారు. ఆయా సమస్యలకు దంతాల ఫిల్లింగ్, రూట్ కెనాల్ థెరపీ, స్కేలింగ్, డీప్ క్లీనింగ్, కాస్మోటిక్స్ చికిత్సలు అందించాలి. దెబ్బతిన్న పంటికి కృత్రిమ కప్పు వేయడం, వంకర, పసుపు రంగు ఉన్న వాటిని సరి చేయడం, కృత్రిమంగా అమర్చడం, ఖాళీ స్థలాన్ని పూడ్చడం, సక్రమంగా లేకుంటే తొలగించడం, దుర్వాసన, నొప్పుల నివారణకు చికిత్స చేయడంతో పాటు ప్రమాద ఘటనల్లో దంతాలు దెబ్బతిన్న బాధితులకు అత్యవసర చికిత్సలు చేయాలి. ఈ సేవల కోసం డయాగ్నోస్టిక్ సదుపాయం, ఆధునిక పరికరాలు, నిపుణులు అవసరం.

**సదుపాయాలు పెరగాలి..**

ఆస్పత్రి దంత విభాగంలో ప్రస్తుతం ఒక్కో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. వసతుల లేమితో సాధారణ సేవలతోనే వారు నెట్టుకొస్తున్నారు. దంతాలకు అన్ని రకాల చికిత్సలు అందించాలంటే మౌత్ మిర్రర్, ప్రొబ్, డిజిటల్ ఎక్స్‌రే, ఓరల్ కెమెరా, అల్ట్రాసోనిక్ స్కేలర్, పాలిషింగ్ బ్రష్ వంటి పరికరాలు కావాలి. ఇవన్నీ లేకపోయినా బోధనాసుపత్రిలో కనీస సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. తగిన పరికరాలు అందుబాటులో లేక సేవలు సర్వసాధారణంగా మారాయి. దంత చికిత్స అందించే కుర్చీ, వివిధ రకాల అద్దాలు, ఇతర పరికరాలు సైతం లేవు. రోగులకు కనీస స్థాయి వైద్యం సైతం లభించడం లేదు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమైన చికిత్సల కోసం బాధితులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు.

**పరికరాలు కొనుగోలు చేస్తాం**

**ఎల్.కిరణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్**

ప్రస్తుతం ఉన్న సదుపాయాలతో చికిత్సలు అందిస్తున్నాం. కొన్ని రకాల పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పంటి సమస్యలతో అనేక మంది చికిత్స కోసం వస్తున్నారు. ముమ్ముందు అన్ని రకాల సేవలు ఇక్కడే లభించేలా ఏర్పాట్లు చేస్తాం.

## అధునాతన హంగులతో సమీకృత మార్కెట్లు



కరీంనగర్ : కరీంనగర్ నగరవాసులకు అన్ని హంగులతో కొత్తగా సమీకృత మార్కెట్లు అందుబాటులో రానున్నాయి. ప్రస్తుతమున్న ప్రధాన కూరగాయల మార్కెట్, రైతుబజారు ఉండగా మరో నాలుగింటిని నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ నిధులతో రెండు చోట్ల, మిగతా రెండు చోట్ల పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ నిధులు కేటాయించారు. స్మార్ట్ నిధులలో కశ్మీర్‌గడ్డ రైతుబజారులో పనులు కొనసాగుతుండగా, పద్మనగర్‌లో మాత్రం ప్రారంభించేందుకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 10న కేంద్ర, రాష్ట్ర మంత్రులతో ప్రారంభించేలా నగర మేయర్ వై.సునీల్‌రావు చర్యలు చేపట్టారు. మరో వైపు అందులో ఉన్న దుకాణాల్లో వీధివ్యాపారులను కూర్చోవడానికి వీలుగా దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఇప్పటికే ప్రకటన జారీ చేశారు.

**క్యాంపు కార్యాలయం ఎదుట పనులు**

ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా మరో సమీకృత మార్కెట్ పనులు చకచకా చేస్తున్నారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పలుమార్లు పరిశీలించి సగ భాగం పనులు పూర్తి చేసి కూరగాయలు విక్రయించుకోవడానికి వీలు కల్పించాలని నిర్ణయించారు. రోడ్ల మీద, టవర్‌సర్కిల్ చుట్టూ దుమ్ము, ధూళిలో కూరగాయలు అమ్ముతున్నారు. వీరందరిని ఇందుల్లోకి పంపించి ట్రాఫిక్ సమస్యలు దూరం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. క్యాంపు కార్యాలయం ఎదుట స్టాళ్లు నిర్మిస్తున్నారు. త్వరగా పనులు చేస్తే రోడ్ల మీద విక్రయాలకు చెక్ పడే అవకాశాలు ఉన్నాయి.

**సౌకర్యాలు ఇలా...**

పద్మనగర్‌లో 2.08 ఎకరాల స్థలంలో మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో మొత్తం 239 దుకాణాలు నిర్మించారు. మాంసం, చేపలు అమ్ముకోవడానికి వేర్వేరు దుకాణాలు కేటాయించారు. కిరాణం సామగ్రికి ప్రత్యేకంగా షెట్టర్లు, క్యాంటీన్, తాగునీరు, సులభ్‌కాంప్లెక్స్, విశాలమైన పార్కింగ్ స్థలం ఉన్నాయి.

కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా 2.31 ఎకరాల స్థలంలో నిర్మాణ పనులు సగం మేర పూర్తయ్యాయి. లోపలి భాగంలో పనులు ప్రారంభించారు. ఇందులో 347 దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. రానున్న రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశముంది. కశ్మీర్‌గడ్డ రైతుబజారు స్థలంలో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. పార్కింగ్, కూరగాయలు, చేపలు, మాంసం అమ్ముకునేలా స్టాళ్లు ఉండనున్నాయి.

కిసాన్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న మార్కెట్ పనులు ఆగినట్లేనని తెలుస్తోంది. దీనిపై పలు రకాల ఫిర్యాదులు ఉండటం, నిధుల కొరత ఉండటంతో ఆ వైపు చూడటంలేదు.

**16 వరకు దరఖాస్తు గడువు పెంపు**

పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 16 వరకు పొడిగించినట్లు నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వరకు గడువు విధించగా.. 154 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం



ఎల్లంపల్లి : జలాశయం నిల్వ జలాలను ఎత్తిపోతల ద్వారా పాలకుర్తి మండలం కుక్కలగూడూరులోని బండలవాగు చెరువులోకి మళ్లించేందుకు రూ.10 కోట్లతో ఏడేళ్ల కిందట పనులు ప్రారంభించారు. 5 కి.మీ. మేర పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. బండలవాగు చెరువు కట్ట సామర్థ్యం పనులు చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మిస్తే 800 ఎకరాలకు సాగు నీరందనుంది. ఏడేళ్లుగా పనుల్లో పురోగతి లేదు. పైపులైన్ పనులు వెక్కిరిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంతో జయ్యారం, పూట్నూర్ గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి.

**సంయుక్త సర్వేలో జాప్యం**

మంథని మండలం భట్టుపల్లి సమీపంలో మల్రివాగు ప్రాజెక్టు నిర్మించేందుకు 1992లో రూ.38.02 లక్షలు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో 25.05 హెక్టార్ల అటవీ, 14 ఎకరాల పట్టా భూములు ముంపునకు గురి కానున్నాయి. 2013లో అటవీశాఖకు రూ.4.82 కోట్లు, రైతులకు రూ.2.94 కోట్లు చెల్లించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి ఫేజ్-1 అనుమతి వచ్చింది. ప్రత్యామ్నాయంగా జగిత్యాల జిల్లా బుగ్గారంలో భూమి కేటాయించారు. ఆయా భూములను రెవెన్యూ, అటవీ, నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. ఈ నివేదిక సమర్పిస్తేనే అటవీ శాఖ నుంచి ఫేజ్-2 అనుమతి వస్తుంది. సంయుక్త సర్వేలో జాప్యం నెలకొంది.

**ప్రతిపాదనలకే పరిమితం**

కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి శివారులోని గుంటిమడుగు ప్రాంతంలో మానేరుపై చెక్‌డ్యాం నిర్మాణాన్ని 2016లో అప్పటి రాష్ట్ర ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తెరపైకి తెచ్చారు. వాగుకు ఇరువైపులా ఎత్తయిన గుట్టలను అనుసంధానిస్తూ చెక్‌డ్యాంతో నీటిని ఎత్తిపోయాలని సంకల్పించారు. మెట్ట ప్రాంతాలైన కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లోని 10 వేల ఎకరాలకు సాగు నీరందించాలని భావించారు. అప్పటి కలెక్టర్ వర్షిణి పరిశీలించి డీపీఆర్ సర్వేకు నిర్ణయించారు. వివిధ కారణాలతో చెక్‌డ్యాం నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఏటా పంట చివరి దశలో ఎస్సారెస్పీ నీరందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటే మెట్ట ప్రాంతం సాగులోకి రానుంది.

## పల్లె పోరుకు సన్నాహాలు

సిరిసిల్ల : జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే తుది జాబితా విడుదల చేయగా స్థానిక సమరానికి సన్నాహాలు చేస్తున్నారు. నోడల్ అధికారుల నియామకానికి కసరత్తు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం సర్పంచి, వార్డు సభ్యులకు ఎన్నికల గుర్తులు సిద్ధం చేశారు. జిల్లాలోని 260 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బ్యాలెట్ పెట్టెలు, కరదీపికలు, ముద్రణ సామగ్రి సిద్ధం చేస్తున్నారు. 2,268 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణతోపాటు బ్యాలెట్ పేపర్‌పై గుర్తులను కేటాయించారు. పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికల్లో సర్పంచి అభ్యర్థులకు 30, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20తోపాటు అదే బ్యాలెట్ పేపర్‌పై అదనంగా నోటాను ముద్రించనున్నారు. అభ్యర్థులు నచ్చని క్రమంలో నోటాకు ఓటేసే అవకాశం కల్పించారు. సర్పంచికి సంబంధించి బ్యాట్, బ్యాట్స్‌మెన్, స్టంప్స్, ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, లేడీ పర్సు, టీవీ రిమోట్, టూత్‌పేస్టు, పాన, చెత్తడబ్బా, నల్లబోర్డు, బెండకాయ, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్‌హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ గుర్తులను కేటాయించనున్నారు. అదేవిధంగా వార్డు సభ్యులకు గౌను, గ్యాస్‌పొయ్యి, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్‌యాంటీనా, గరాట, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టుడబ్బా, కవర్, హాకీ కర్ర, బంతి, నెక్‌టై, కటింగ్‌ప్లేయర్, విద్యుత్తు స్తంభం, కెటిల్ ఉన్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే మరో బ్యాలెట్ కేటాయించనున్నారు. ఇప్పటికే బ్యాలెట్ పత్రాల ముద్రణకు టెండర్‌లు అప్పగించారు. **బ్యాలెట్‌ల ముద్రణ- బంగారి నరేశ్, డీఎల్‌పీవో సిరిసిల్ల** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల చేశాం. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, కరదీపికలు సిద్ధం చేశాం. సర్పంచి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వారికోసం గుర్తుల కేటాయింపు జరిగింది. బ్యాలెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన టెండర్ పూర్తయింది.

## క్రయ విక్రయాల తిప్పలు తప్పేదెన్నడో?

జగిత్యాల : జిల్లా కేంద్ర వ్యవసాయ మార్కెట్యార్డు అధిక ఆదాయం కలిగి ఏడాది పొడవునా క్రయవిక్రయాలు సాగిస్తున్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాల కల్పనలో వెనకంజలోనే ఉంది. బీటుబజార్‌లో పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాల్లో గోదాములు, కార్యాలయం, రైతు విశ్రాంతి భవనం, ఏడీఏ కార్యాలయం, భూసార పరీక్షా కేంద్రం, ఈనామ్ భవనం తదితర నిర్మాణాలున్నాయి. మిగిలిన స్థలంలో దినుసుల క్రయవిక్రయాలు చేపట్టేవారు. ఇందులోనుంచి 2 ఎకరాల స్థలాన్ని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెటుకు ఇవ్వటంతో దినుసుల కల్లానికి స్థలం ఇరుకుగా మారింది. మిగిలున్న కొంత స్థలంలోనే దినుసులను కొంటున్నా మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ దినుసుల యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోటగా పరిస్థితి మారింది.

**అందని నిధులు** చల్‌గల్‌యార్డుకు బీటును పూర్తిగా తరలిద్దామన్నా అక్కడ పూర్తిస్థాయి క్రయవిక్రయాలు జరిపే పరిస్థితుల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి గతంలో తీసుకున్న 21 ఎకరాల్లో 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి కేటాయించారు. దినుసుల బీటుకు ఇచ్చిన 16 ఎకరాల స్థలంలోనే 15 వేల టన్నుల సామర్థ్యంగల 4 భారీ గోదాములను, ఒక రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, ధర్మకాంటా, 4 వేయింగ్‌షెడ్లు తదితర నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన 5 ఎకరాల భూమిలోనూ సిమెంటు గచ్చు లేనందున కందులు, పెసలు, మక్కలు,



నువ్వులు తదితర దినుసులను కుప్పలుగా పోసి విక్రయించటం సాధ్యపడదు. వాలంతరి నుంచి మరో 10 ఎకరాలను తీసుకున్నా ఈ స్థలంకూడా మామిడి మండీకే కేటాయించటంతో దినుసుల బీటుకు 5 ఎకరాల స్థలమే మిగిలింది. ఏడాదిక్రితమే ఈ స్థలంలో రూ. కోటితో గచ్చు, రూ.70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ.5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ.10 లక్షలతో గోదాముల మరమ్మతులు తలపెట్టినా ఇప్పటికీ నిధులు మంజూరుగాక పనులను చేపట్టలేదు. చల్‌గల్‌యార్డు పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది. రైతులు, అడ్తీ ఖరీదుదారులు, మిల్లర్లు, చాట సడెం కూలీలు, దడువాయిలు, హమాలీలు చల్‌గల్‌కు వెళ్లి పొద్దంతా ఉండి క్రయవిక్రయాలు, తూకం చేపట్టాలంటే అనేక ఇబ్బందులుం టాయి. ఈ నేపథ్యంలో చల్‌గల్ యార్డులో రైతు విశ్రాంతి భవనంతో పాటుగా ఇతర భవనాలను నిర్మించాలి.

దినుసుల బీటును చల్‌గల్‌లో నిర్వహిస్తే ప్యాక్స్ ఆధ్వర్యంలోని చల్‌గల్ ధాన్యం సేకరణ కేంద్రానికి మరో స్థలాన్ని సమకూర్చాలి. దీనిపై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ వివరిస్తూ నిధులు వస్తే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి పనులను ప్రారంభిస్తే యాసంగి పంట ఉత్పత్తుల విక్రయ సమయానికి అందుబాటులోకి వస్తుంది.

## చరిత్ర ఘనం.. పరిస్థితి దయనీయం

హైదరాబాద్ : అద్భుతమైన కళా సంపద.. అపురూప శిల్పాలు.. అరుదైన ఈజిప్షియన్ మమ్మీ.. ప్రపంచంలోనే ఘనమైన నాణెలు.. ప్రసిద్ధ జైన, బౌద్ధ శిల్ప సంపద ఉన్న రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల (స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం) నిరాదరణకు గురై సందర్శకులకు దూరమవుతోంది. 94ఏళ్ల చరిత్ర కలిగిన పబ్లిక్‌గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియంలో అరుదైన కళా సంపద పెట్టెలు.. తాళాలు వేసిన గదులకే పరిమితమవుతోంది.

**ఎన్నో ప్రత్యేకతలు**

దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన వారసత్వ భవనంలోని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం ప్రపంచంలోనే విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియం తర్వాత అత్యంత అరుదైన నాణెలు కలిగిన మ్యూజియంగా ప్రసిద్ధిగాంచింది. మన దేశంలో ఉన్న ఆరు ఈజిప్షియన్ మమ్మీల్లో ఒకటి ఇక్కడే ఉంది. అరుదైన మధ్య యుగపు నాటి అబ్దుల్ రహ్మాన్ సోగతాయి పెయింటింగ్స్ ఇక్కడే ఉన్నాయి. గద్వాల సంస్థాన కాలానికి చెందిన కూచిపూడి జడ సహా మధ్యయుగానికి సంబంధించిన అనేక నగలు ఉన్నాయి. శిలాయుగం నుంచి మధ్యయుగం దాకా జనజీవనంలో అన్ని అంశాలను స్పృశించే వస్తువులు ఉండటం విశేషం. కంచు విగ్రహాలు, బౌద్ధశిల్పాలు, బావికొండలో దొరికిన బుద్ధుని అస్తికలు.. కుతుబ్‌షాహీల కాలానికి సంబంధించిన వస్త్రధారణ, దక్కన్ మినియేచర్‌లు, అరుదైన శాసనాలు, మధ్యయుగంలో యుద్ధాల్లో ప్రత్యేక పాత్ర పోషించిన వివిధ రకరకాల ఫిరంగులు, అంతర్జాతీయ పరిశోధకులు ఆసక్తిగా పరిశోధించే జైన శిల్పాలు.. ఇలా తరగని అరుదైన వారసత్వ సంపద ఈ మ్యూజియం సొంతం. కానీ, సందర్శకుల సంఖ్య రోజు 30, 40 మంది కూడా ఉండకపోవడం ఆలోచించాల్సిన అంశం.

**25 శాతమే సిబ్బంది.. వసతులు లేవు**

స్టేట్ మ్యూజియంలో 80 మంది ఉద్యోగులకు 20 మందే ఉన్నారు. సిబ్బంది లేక కొన్ని గ్యాలరీలను మూసేశారు. సందర్శకులకూ కనీస వసతులు లేవు. తలుపులు లేని మరుగుదొడ్లు.. విరిగిన కుర్చీలు.. పగిలిన కిటికీలు.. అరకొర విద్యుత్ దీపాలతో దారుణమైన పరిస్థితుల్లో మ్యూజియం ఉంది. వేర్వేరు ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకువస్తున్నారు. చివరకు ఇక్కడికి ఎందుకు వచ్చామా? అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నామమాత్రంగానే ప్రదర్శన**

ఇక్కడ ఎన్నో ఉన్నా ప్రదర్శిస్తోంది నామమాత్రమే. మూడు నాలుగు గ్యాలరీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈజిప్షియన్ మమ్మీతోపాటు, డెకరేటివ్ ఆర్ట్ గ్యాలరీ, బుద్ధ గ్యాలరీ, ఇస్లామిక్ ఆర్ట్‌గ్యాలరీ, అజంతా చిత్రకళ గ్యాలరీ, అరబిక్, పర్షియన్ శాసనాలతో పాటు, ఆరుబయట ఉన్న ఫిరంగులు, కాకతీయ మండపం, చెక్కతో చేసిన రథంతోపాటు శిల్పాలు మాత్రం చూడగలుగుతున్నారు. వందేళ్లనాటి భవనం పలుచోట్ల దెబ్బతింది. బయటి కళారూపాలు వానకు తడిచి, ఎండకు ఎండుతున్నా పట్టించుకోవడం లేదు.

**తీవ్ర నిరాశకు గురయ్యాం:**ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్ జిల్లా

40 మంది పిల్లల్ని విజ్ఞానయాత్రకు ఇక్కడికి తీసుకొచ్చాం. సగం కూడా ప్రదర్శించడం లేదు. ఏది చూసినా గేట్లు మూసి, తాళాలు వేసే ఉన్నాయి. ఉన్నవాటి వివరాలు సరిగ్గాలేవు. వివరించేవారు లేరు. పిల్లలు పది నిమిషాలు కూడా మ్యూజియంలో ఉండలేదు.

# కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడో!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వ వైఖరి వేలాదిమంది బీడీకార్మికుల పాలిట శాపంగా మారింది. 2014 ఫిబ్రవరి 28 వరకు పీఎఫ్ ఖాతాలో నమోదైనవారికే జీవనభృతి పింఛన్లు అందిస్తున్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ అమల్లోకి రాకపోగా ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారాస రెండుసార్లు అధికారంలో ఉన్నపుడు కటాఫ్ తేదీని ఎత్తివేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఎత్తివేయక అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా పీఎఫ్ ఖాతాకలిగిన ప్రతిఒక్కరూ ఆసరా పింఛన్‌కు దరఖాస్తు చేయాలని గతంలో ప్రభుత్వం సూచించటంతో వేలాదిమంది దరఖాస్తు చేశారు. 18-50 ఏళ్లలోపు వయసువారు 1.5 లక్షల్లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకుఖాతా, రేషన్‌కార్డు, ఈపీఎఫ్ అపాయింట్మెంట్‌లెటర్, ఆన్‌లైన్ స్టేట్మెంటు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో ఎంపీడీవో కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో అందించారు. కానీ వీరికి ఇప్పటికీ పింఛన్ మంజూరు



కాలేదు. పూర్వపు కరీంనగర్ జిల్లాలోని లక్షలాదిమందికి దశాబ్దాలుగా ఉపాధి కల్పించిన బీడీ పరిశ్రమ క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఆసరా ఫించన్ పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్యరీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉండగా సిరిసిల్ల జిల్లా నాలుగోస్థానంలో ఉండటం ఇక్కడివారి అనుబంధ ఉపాధిని వెల్లడిస్తోంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రధాన పట్టణాలు, మండలాలు, పల్లెల్లోనూ బీడీ పరిశ్రమ ఆధారితంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 46 వరకు బీడీ కంపెనీలుండటం ఇక్కడి బీడీ పరిశ్రమ ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. పల్లెలు, పట్టణాలని తేడాలేకుండా చాలామంది బీడీలు చుట్టడాన్ని ఉపాధిగా మలచుకోగా బీడీ తయారీ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రభావం, చవకరకం సిగరెట్ల పోటీతో బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గి ప్రస్తుతం నెలలో తగినన్ని పనిరోజులు లేనందున కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ, బీడీల తయారీకి తగినట్లు తునికాకును సరఫరా, బీడీల తయారీ ధరను పెంచటం, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ. 1.50 లక్షల రాయితీ ఇవ్వటం, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించి తమ పిల్లలకు ఉపకార వేతనాల మంజూరు, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందించటం, అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపుతోనే తమ మనుగడ సాగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

# అన్నదాత ఇంట.. సిరుల పంట

పెద్దపల్లి : జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో అన్నదాత పంట పండింది. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రచారం సత్ఫలితాలనిచ్చింది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులతో అధికారులు అంచనా వేసిన దాని కంటే ధాన్యం దిగుబడి స్వల్పంగా తగ్గింది. బోనస్ చెల్లింపుతో రైతులకు గిట్టుబాటు కలిగింది. ఈ సీజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం ఊరట కలిగించింది.

**50 వేల ఎకరాలు అధికం**

వానాకాలంలో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. ఇందులో 1.72 లక్షల ఎకరాల్లో సన్న రకం, 36 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు పెరిగింది. ఈ మేరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 90 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రానుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి పైర్లు పొట్ట దశలో ఉన్నపుడు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గింది. జిల్లాలో ఇప్పటివరకు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో 64 వేల టన్నులు, మిల్లర్లు నేరుగా 30 వేల టన్నులు కొనుగోలు చేశారు. సన్న ధాన్యానికి సంబంధించి 2.18 లక్షల టన్నులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించగా మరో 20 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. రైతులు సొంత అవసరాలకు మరో 30 వేల టన్నులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

**కలిసొచ్చిన అధికారుల ప్రచారం**

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో జిల్లాలో సన్న వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. సీజన్ ఆరంభం నుంచే బోనస్ చెల్లింపుపై అధికారులు ప్రచారం చేశారు. ఊహించినట్లుగానే రైతులకు బోనస్ లాభదాయకంగా మారింది. క్వింటాలుకు రూ.500 చెల్లిస్తుండటంతో పెట్టుబడుల భారం తప్పుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 50,523 మంది రైతుల నుంచి రూ.658.74 కోట్ల విలువైన 2.83 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 48,538 మందికి రూ.657.03 కోట్లు చెల్లించారు. 1.98 లక్షల టన్నుల సన్న ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయగా మొత్తం రూ.99 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా రూ.75.59 కోట్లు జమయ్యాయి.

**ఆర్థిక భారం తీరింది**

నాకున్న మూడున్నర ఎకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని సన్న వరి సాగు చేశా. తెగుళ్ల నివారణ చర్యలు తీసుకున్నా. మొత్తం 160 క్వింటాళ్ల దిగుబడి రాగా ప్రభుత్వం నుంచి రూ.80 వేల బోనస్ వచ్చింది. పెట్టుబడి ఖర్చులకు ఆర్థిక భారం తీరింది. -మార్త దేవేందర్, మచ్చుపేట, ముత్తారం మండలం

**రూ.1.35 లక్షల బోనస్** తొమ్మిదెకరాల్లో సన్న వరి వేశా. ఎకరాకు 30 క్వింటాళ్ల చొప్పున 270 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం రూ.1.35 లక్షల బోనస్ వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రైతులకు ప్రోత్సాహకంగా ఉంది. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుండగా బోనస్ చెల్లింపులు మాకెంతో అండగా నిలిచాయి. -గంధం మహేందర్, మల్లాపూర్, ధర్మారం

# సాగర్ చుట్టూ సరికొత్త సొగసులు



హైదరాబాద్: చారిత్రక హుస్సేన్‌సాగర్ సరికొత్త రూపు సంతరించుకోనుంది. ఖైరతాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లను అనుసంధానిస్తూ సాగర్ చుట్టూ నిర్మించ తలపెట్టిన స్కైవాక్, సైకిల్ ట్రాక్‌కు సంబంధించిన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసేందుకు పలు సంస్థలతో సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించారు. నగరంలో ప్రధాన పర్యాటక ప్రాంతంలో హుస్సేన్‌సాగర్‌లోని నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు, లుంబినీపార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ కీలకమైనవి. వారాంతాలతోపాటు ఇతర సెలవుల్లో వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వారాంతాల్లో సందర్శకుల సంఖ్య లక్షపైనే ఉంటుంది. సాగర్ చుట్టూ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక సిద్ధం చేసింది.

**మెట్రోతో అనుసంధానం...**

మెట్రోలో వచ్చే వారు హుస్సేన్‌సాగర్ వద్దకు వెళ్లేందుకు ఎక్కువ మంది ఖైరతాబాద్ స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి నడిచి ఐమాక్స్ మీదుగా సాగర్ వద్దకు చేరుకుంటారు. ఎంఎంటీఎస్‌లో వచ్చే వారు సైతం ఖైరతాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ తరుణంలో మెట్రో, ఎంఎంటీఎస్‌ను అనుసంధానిస్తూ...ఐమాక్స్ మీదుగా అటు నెక్లెస్ రోడ్డు.. ఇటు ఎన్టీఆర్ పార్కు నుంచి సాగర్ చుట్టూ స్కైవాక్ నిర్మించాలనేది ప్రణాళిక.

**కొన్నిచోట్ల స్తంభాలు వేసి..**

మొత్తం 10 కిలోమీటర్ల పైనే స్కైవాక్ ఉండనుంది. రోడ్డు పక్కనుంచి అవసరమైన చోట సాగర్‌లో స్తంభాలు వేసి...వాటిపై స్కైవాక్ ఆరు మీటర్ల వెడల్పుతో ఉండనుంది. ఇందులోనే ఒక భాగం సైకిల్ ట్రాక్‌కు, మరో భాగం నడిచే మార్గానికి కేటాయించనున్నారు.

ఖైరతాబాద్ మెట్రో, ఎంఎంటీఎస్‌తోపాటు పీపుల్స్‌ప్లాజా, జలవిహార్, సంజీవయ్యపార్కు, లుంబినీపార్కు, ఇందిరాపార్కు, ఎన్టీఆర్‌గార్డెన్ ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉంటాయి. లిఫ్టులు సైతం ఏర్పాటు చేస్తారు.

పలు ప్రాంతాల్లో ఫుడ్‌కోర్టులు, ఓపెన్ థియేటర్లు, గేమింగ్‌జోన్లు, మినీ థియేటర్లు తదితరాలను అందుబాటులోకి తేనున్నారు. ఒక్కసారి స్కైవాక్‌లోకి ప్రవేశిస్తే మొత్తం పది కిలోమీటర్ల వరకు వాకింగ్ చేస్తూ హుస్సేన్‌సాగర్ అందాలను వీక్షించవచ్చు. సైక్లింగ్, ఉదయపు నడకకు ఈ మార్గాన్ని వినియోగించుకోవచ్చు.

పర్యాటకుల నుంచి కొంత టికెట్ రూపేణా వసూలు చేయడంతోపాటు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు జోన్లుంటాయి. మొత్తం రూ.500కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు.

# దిల్‌కీ సంరక్షణ్



హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలోని 620 ఎకరాల దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (దిల్) భూములకు రక్షణ గోడల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. 15 ఏళ్లుగా వాటికి హద్దులే నిర్ధారించలేని పరిస్థితులున్నాయి. ఇప్పుడు ఆ భూములకు ప్రహరీ నిర్మించేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు టెండర్లు ఖరారు చేసింది. దిల్ పరిధిలో 703 ఎకరాల భూములకుగాను 83 ఎకరాలకు సంబంధించిన వ్యాజ్యాలు న్యాయస్థానాల్లో పెండింగులో ఉన్నాయి. మిగిలిన వివాదరహిత 620 ఎకరాలను కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటికి ప్రహరీల నిర్మాణానికి టెండర్ల దాఖలుకు హౌసింగ్ బోర్డు ఈనెల 4న నోటిఫికేషన్ జారీ చేసింది. 18 ప్యాకేజీలుగా ఆ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అన్నింటికీ గుత్తేదారులు ముందుకు రావటంతో ఖరారు చేసింది. ఎల్-1గా నిలిచిన గుత్తేదారులకు ఒప్పందాలు చేసుకోవాల్సిందిగా లేఖలు రాసింది.

**నిర్ణీత వ్యవధిలోనే..** గుత్తేదారులు ఒప్పందం చేసుకున్న నాటి నుంచి 2 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఒక్కో ప్యాకేజీలో సగటున 32 నుంచి 35 ఎకరాల మధ్య ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. హద్దులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతికతో సర్వే చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సాంకేతికతతో గుర్తించిన మేరకు ఆయా భూముల సరిహద్దులను జీపీఎస్‌తో అనుసంధానం చేశామని వివరించారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణ...**

ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దిల్ భూములతోపాటు హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను కూడా ఆధునిక సాంకేతికతతో అధ్యయనం చేసి జీపీఎస్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. త్వరలో వేలం వేయనున్న ప్లాట్లు, భూముల సరిహద్దులను సైతం సర్వే త్వరలో కొలిక్కి రానున్నట్లు సమాచారం. రక్షణ గోడలు నిర్మించేందుకు రూ.25 కోట్లను కూడా ప్రభుత్వం విడుదల చేసినట్లు ఉన్నతాధికారి వివరించారు.

# వేసవికి ముందే జలదరింపు




హైదరాబాద్: నగరంలో వేసవి నీటి ఎద్దడి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వారం రోజుల్లో జలమండలి ట్యాంకర్లకు గత ఏడాదికంటే రెట్టింపు డిమాండ్ రావడమే దీనికి నిదర్శనం. రానున్న వేసవిలో తీవ్ర డిమాండ్‌కు సంకేతంగా జలమండలి భావిస్తోంది. గతేడాది జనవరి మొదటి ఆరు రోజుల్లో 8980 నీటి ట్యాంకర్లు బుకింగ్ కాగా ఈ ఏడాది జనవరి 6 నాటికి 16,257 ట్యాంకర్లు బుక్ కావడం గమనార్హం. వాటిలో 90 శాతంపైగా ట్యాంకర్లను నిర్దేశించిన గడువులోపే పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ట్యాంకర్ కోసం వినతి వచ్చిన వెంటనే నిర్దేశించిన సమయంలోనే వినియోగదారులకు అందించడం అత్యంత ప్రాధాన్య అంశంగా జలమండలి చేపట్టింది. డిమాండ్ వచ్చిన ట్యాంకర్లకు వందశాతం నిర్దేశించిన గడువులోపు పంపాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా కొత్తగా ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయడంతో పాటు సరఫరాకు అనుగుణంగా ట్యాంకర్ల సంఖ్య పెంచడంపై దృష్టి సారించారు.

**ఆ ప్రాంతాల్లోనే..** నగరంలో దుర్గంచెరువు డివిజన్‌లో ఈ నెల మొదటివారంలో ట్యాంకర్లకు భారీ డిమాండ్ వచ్చింది. ఈ డివిజన్‌లో గతేడాది ఇదే సమయానికి 2138 ట్యాంకర్లు బుక్ కాగా ఈసారి 4822 ట్యాంకర్లకు వినతులు వచ్చాయి. అదే విధంగా మణికొండ ప్రాంతంలో గతేడాది కంటే ఈ సారి మూడు రెట్లు ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా నగరంలో ఎస్సార్‌నగర్, కూకట్‌పల్లి, నిజాంపేట, హఫీజ్‌పేట, బోడుప్పల్ డివిజన్లలో ట్యాంకర్ల డిమాండ్ గణనీయంగా పెరిగింది.

# ఫిబ్రవరి నుంచే సుర్రుసుర్రు.. విద్యుత్తు మీటర్లు గిర్రుగిర్రు

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏటేటా విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. 2023లో వార్షిక సగటు డిమాండ్ 2917 మెగావాట్లు ఉండగా, 2024లో 3218 మెగావాట్లకు ఎగబాకింది. వృద్ధి 10.18 శాతంగా నమోదైంది. నగరం పరిధిలో 2024 డిసెంబరు నాటికి 62.92 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. అంతకుముందు ఏడాదిలో 60.26 లక్షలు ఉన్నాయి. ఏటా రెండు లక్షలకు పైగా కొత్త కనెక్షన్లు వస్తుండటం గమనార్హం.

**ఆ నాలుగు నెలలు అధికం**

విద్యుత్తు వినియోగం మార్చి నెల నుంచి ఒక్కసారిగా పెరుగుతోంది. ఏప్రిల్, మే వరకు ఎండల కారణంగా వాడకం అధికంగా ఉంటుంది. ఈ మూడు నెలలు వార్షిక సగటు వినియోగం కంటే అధికంగా వాడకం ఉంటుంది. పెరుగుదలలో ఏకంగా మార్చి నెలలో 24.52 శాతం నమోదైంది. ఏప్రిల్‌లో 19.66, మేలో 13.46 శాతం రికార్డైంది. జూన్‌లో తగ్గినా.. జులైలో 12.91 శాతం పెరుగుదల కనిపించింది.

**గరిష్ఠానికి తగ్గట్టుగా ఏర్పాట్లు**

గత అనుభవాల దృష్ట్యా ఈ ఏడాది వేసవికి డిస్కం కార్యాచరణ చేపట్టింది. గత రెండేళ్లలో 80నుంచి 90 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదుకాగా ఈసారి సెంచరీ దాటుతుందంటున్నారు. గరిష్ఠ డిమాండ్ 5వేల మెగావాట్లకు తగ్గట్టుగా కార్యాచరణ చేపట్టారు. జనవరికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆశించినంత వేగంగా పనులు జరగడం లేదు. ఎస్ఈలదే బాధ్యత


వచ్చే ఈ వేసవిలో అంతరాయాల సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎస్ఈలదేనని నూతన సంవత్సరం సందర్భంగా సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్పష్టంచేశారు. ఆయన హెచ్చరికలతో.. ఎస్ఈలు నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై వేటు వేస్తున్నారు. వినియోగదారులు ఫోన్ చేసినా స్పందించకపోవడం, గతంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఒక ఏఈకి మెమో జారీ చేశారు.

# విమానయానానికి వేగంగా అడుగులు

కొత్తగూడెం : కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చూపిన స్థలాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించటానికి త్వరలోనే ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) బృందాలను పంపిస్తామని పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఇందుకు సంబంధించి ఏఏఐ విజ్ఞప్తి మేరకు రూ.38లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ సర్వే త్వరలో మొదలుకానుంది.

**మూడు మండలాల పరిధిలో..**

కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లోని సుమారు 1,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టును నిర్మించనున్నారు. ఇప్పటికే కొత్తగూడెం సమీపంలోని గరీబ్‌పేట చుట్టూ చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల పరిధిలో భూసేకరణపై అధికారులు ఓ అంచనాకు వచ్చారు. తెలంగాణలో ఆరు రీజినల్ ఎయిర్‌పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని మూడేళ్లలో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే స్థల సర్వేకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏఏఐ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ప్రత్యేక బృందాలు సర్వే చేసి నివేదికను



కేంద్రానికి సమర్పించనున్నాయి.

**మలుపులు ఎన్నో..**

కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే అంశం 17ఏళ్లుగా అనేక మలుపులు తిరుగుతోంది. రేణుకాచౌదరి కేంద్రమంత్రిగా పనిచేసిన కాలంలో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలనే అంశం తొలిసారి తెరపైకి వచ్చింది. సుజాతనగర్‌లో నిర్మిస్తారనే ప్రచారం జోరుగా సాగినా.. ఆ తర్వాత స్తబ్దత ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీనిపై అనేకసార్లు చర్చలు జరిగాయి.

2015 జనవరిలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పటి పౌరవిమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజును కలిసి కొత్త విమానాశ్రయ నిర్మాణానికి సహకారమందించాలని కోరారు.

2015 ఫిబ్రవరిలో విమానాశ్రయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించటానికి తనిఖీ బృందాలను పంపనున్నట్లు విమానయాన మంత్రిత్వశాఖ ప్రకటించింది. 2015 ఆగస్టులో కొత్తగూడెం నుంచి 20కి.మీ. దూరంలోని పునుకుడుచెల్కలో విమానాశ్రయ నిర్మాణం కోసం 1,600 ఎకరాల స్థలాన్ని గుర్తించారు.

2016 సెప్టెంబరులో విమానాశ్రయం ప్రాజెక్టు నిర్మాణానికి 'సైట్ క్లియరెన్స్' సిఫార్సు చేశారు.

2016 డిసెంబరులో 'వన్య ప్రాణుల అభయారణ్యంలో సాధారణంగా ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదంటూ.. విమానాశ్రయ నిర్మాణానికి ఇక్కడ అవకాశాలు తక్కువగా ఉన్నట్లు ఘజియాబాద్ గ్రీన్ ఇండియా కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ స్పష్టం చేసింది.

2021 జనవరిలో విమానాశ్రయ అధికారులు కొత్తగూడెం-పాల్వంచ మధ్య ప్రతిపాదిత భూమిని సందర్శించారు. ఆ తర్వాత ఈ అంశం మరుగునపడింది. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈసారి ఆ దిశగా కార్యాచరణ మొదలైంది. కొత్తగూడెంలో విమానాశ్రయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా కొత్తగూడెం-పాల్వంచ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. భవిష్యత్తులో కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలు వాణిజ్యం, పర్యాటక, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతాయి. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.
కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

# ఫలించిన బీటీపీఎస్ ఉద్యోగుల నిరీక్షణ

మణుగూరు : భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది. గత 12 ఏళ్లుగా ఉద్యోగులు ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూడగా, ఇటీవల జెన్కో సంస్థ నాలుగు దఫాలుగా 47 మందికి ఉద్యోగోన్నతులు కల్పించింది. జీపీఏలు పీఏలుగా, పీఏలు ఫోర్‌మెన్ ఫోర్త్‌గ్రేడ్‌లుగా, ఫోర్‌మెన్ ఫోర్త్‌గ్రేడ్‌లు సెకండ్ గ్రేడ్ ఫోర్‌మెన్‌లుగా, సెకండ్ గ్రేడ్ ఫోర్‌మెన్‌లు మొదటి గ్రేడ్ ఫోర్‌మెన్‌లుగా ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగోన్నతుల కోసం కార్మికులు ఎంతో కాలం నుంచి పోరాటం చేస్తున్నారు. కార్మికులు, కార్మిక సంఘాలు జెన్కో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జెన్కో సంస్థ కార్మికులకు ఉద్యోగోన్నతి లభించింది.

**ఏటా జరగని డీపీసీ**

బీటీపీఎస్‌లో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) బీటీపీఎస్‌లో ప్రతిఏటా జరగటం లేదు. ఉద్యోగోన్నతులు కల్పించడంలో డీపీసీ నిర్ణయం మేరకు జరుగుతుంది. బీటీపీఎస్ కొత్త ప్లాంట్ కావడంతో గత నాలుగేళ్లుగా డీపీసీ జరగలేదు. దీంతో గతనెల మాత్రమే డీపీసీ జరగటంతో ఉద్యోగోన్నతులు కల్పించారు. ఖాళీ అయిన స్థానాలను అనుసరించి డీపీసీ ఉద్యోగోన్నతులను కల్పిస్తుంది.

**అయినా తక్కువే**

1,080 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బీటీపీఎస్ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించటం చాలా తక్కువనే చెప్పాలి. మొదటి నుంచి బీటీపీఎస్‌కి శాంక్షన్ పోస్టులు సంఖ్య తక్కువ. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతులు కూడా తక్కువ కల్పించటం జరిగింది. బీటీపీఎస్ కన్న తక్కువ సామర్థ్యం ఉన్న ప్లాంట్లలో ఎక్కువ మంది కార్మికులు పని చేస్తుంటే, 1080 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బీటీపీఎస్‌లో మాత్రం కేవలం 552 మంది కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కీలకంగా పని చేసే ఫోర్‌మెన్‌లు బీటీపీఎస్‌లో 9 మంది పని చేయటం గమనార్హం. దీంతో పైస్థాయిలో పని చేసే ఉద్యోగులు సంఖ్యా తక్కువగా ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించటంలో జాప్యం ఏర్పడుతుంది.

ఖాళీలను అనుసరించి ఉద్యోగోన్నతులు
కల్పించాం: బిచ్చన్న, సీఈ
ఖాళీలను అనుసరించి ఈ ఏడాదికి ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాం. బీటీపీఎస్‌కి కూడా త్వరలోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగుల కేటాయింపు ఉంటుంది.

## పోతేపోనీ.. ప్రభుత్వ ఆస్తులేగా

హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను అక్రమ లీజుదారులు దర్జాగా అనుభవిస్తున్నారు. దశాబ్దం క్రితం లీజు పూర్తయినా వాటిని స్వాధీనం చేసుకోవట్లేదు. గజం స్థలానికి రూ.1 అద్దె చెల్లిస్తోన్న లీజు ఒప్పందాలు యథాతథంగా కొనసాగుతున్నాయి. దీంతో ప్రైవేటు వ్యక్తులు రూ.కోట్లు సంపాదిస్తుంటే..జీహెచ్ఎంసీ మాత్రం చిల్లరతో సరిపెట్టుకుంటోంది.



జీహెచ్ఎంసీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో రూ.కోట్లు విలువ చేసే ఆస్తులున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ఖాళీ స్థలాలు, రద్దీ ప్రదేశాల్లో మార్కెట్లు, మున్సిపల్ కాంప్లెక్సులు ఉన్నాయి. గతంలోని లెక్కల ప్రకారం 26 మార్కెట్లు, 19 కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మార్కెట్లలో 2,330, కాంప్లెక్స్‌లలో 985 దుకాణాలు ఉన్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం మెజార్టీ దుకాణాలను 25ఏళ్లకు బల్దియా లీజుకిచ్చింది. వీటిలో 90శాతం దుకాణాలను లీజుదారులు ఇతరులకు అద్దెకిచ్చారు. నిబంధనల ప్రకారం..లీజు పూర్తయ్యాక అధికారులు ఆయా దుకాణాలను ఖాళీ చేయించాలి. మళ్లీ వేలం వేసి ప్రక్రియను కొనసాగించాలి. ఏడాదికోసారి అద్దె విలువ 5శాతం మేర పెరగాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం..లీజు గడువు ఏడాది మాత్రమే. దాంతో ఏళ్లుగా దుకాణాలనువినియోగించుకుంటున్న వ్యక్తులు వేలానికి ఒప్పుకోవట్లేదు. దీనికి కేంద్ర కార్యాలయం పరోక్షంగా సహకరిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

**అంచనాలు.. సవరణలతో సరి..** ఎకరాల కొద్దీ ఖాళీ స్థలాలు, వేలాది దుకాణాల నుంచి బల్దియాకు ఏటా వచ్చే ఆదాయం రూ.4.5కోట్లే. ప్రతిసారీ పద్దులో రూ.10కోట్లు, రూ.11కోట్ల అద్దెసొమ్ము వస్తుందని ఆర్థిక విభాగం అంచనాలు రూపొందించడం.. వచ్చిన అద్దెతో లెక్కలను సవరించుకోవడం ఆనవాయితీగా మారింది.

**నోటీసులతో సరి..**

మార్కెట్లలోని 1,500 దుకాణాలు, కాంప్లెక్సుల్లోని 600 యూనిట్లు, పలు స్థలాల లీజు గడువు పూర్తయింది. అధికారులు నోటీసులు ఇవ్వడం తప్ప స్వాధీనం చేసుకోవడం లేదు. అజాద్, మోజంజాహి మార్కెట్, తదితర ప్రాంతాల్లోని దుకాణాల నుంచి బల్దియాకు కొన్నేళ్లుగా అద్దె వసూలవ్వట్లేదు. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లోని దుకాణాలకు నామమాత్రం అద్దె వసూలవుతోంది. రూ.వేలకోట్లు ఆస్తులు ఉన్న ఎస్టేట్స్ విభాగాన్ని కమిషనర్‌తోపాటు ఎస్టేట్స్ విభాగం అదనపు కమిషనర్ కార్యాలయమూ నిర్లక్ష్యం వహిస్తోంది.

## రూ.5,942 కోట్ల కొత్త ప్రాజెక్టులకు పచ్చజెండా

హైదరాబాద్: రాజధానిలో రహదారి కష్టాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జీహెచ్ఎంసీ ప్రతిపాదించిన 23 రోడ్డు అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. రూ.5,942 కోట్లను ఖర్చు చేసేందుకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ గురువారం ఉత్తర్వు జారీ చేశారు. జీహెచ్ఎంసీపై భారం పడకుండా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుతుందని, ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో ఆమేరకు కేటాయింపులు చేస్తుందని పురపాలకశాఖ ఉత్తర్వులో స్పష్టం చేసింది. పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికేగాక, అవసరమైన భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, నాణ్యత నియంత్రణ, ఇతరత్రా పనులకూ రాష్ట్ర పద్దు నుంచే నిధులను ఉపయోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఆ పనులకు ప్రజాపాలన విజయోత్సవాల్లో ఈనెల 3న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

**గత ఉత్తర్వు స్థానంలో..**

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ)లో భాగంగా 9 పనులకు అయ్యే రూ.4,305 కోట్లను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) ద్వారా భరించాలని కోరుతూ జీహెచ్ఎంసీ గత భారాస సర్కారును అభ్యర్థించింది. 2023 సెప్టెంబరు 27న పరిపాలన అనుమతులు ఇస్తూ అప్పటి సర్కారు ఉత్తర్వు జారీ చేసింది. వాటితోపాటు మరో 14 పనులను కలిపి 23 పనులను హెచ్-సిటీలో చేపడుతోంది.

**పెరిగిన ట్రాఫిక్‌కు విరుగుడుగా..** హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇంపాక్ట్ స్టడీ జరిగింది. జీహెచ్ఎంసీ సైతం వాహన రద్దీపై కొత్త నిర్మాణాలు, ఆకాశహర్మ్యాల ప్రభావాన్ని తెలుసుకునేందుకు ఇటీవల అధ్యయనం చేపట్టింది. రహదారి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఆ రెండు అధ్యయనాలు స్పష్టం చేశాయనే విషయాన్ని బల్దియా కమిషనర్ సర్కారుకు తెలియజేశారు. రోడ్లతోపాటు కూడళ్ల అభివృద్ధి, పాదచారులకు సౌకర్యాలు, సొరంగమార్గాలు, వరదనీటి నియంత్రణ పనుల గురించి నివేదిక ఇచ్చారు.

## ధరల దడ

హైదరాబాద్ : ఒక్కసారిగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వారంరోజులుగా కూరగాయలు, నిత్యావసరాల ధరలు 15-20 శాతం పెరిగి జేబులు గుల్ల చేస్తున్నాయి. కుటుంబ బడ్జెట్ ఒక్కసారిగా 25 నుంచి 30 శాతానికి చేరింది. బియ్యం ధరలు 10 రోజులుగా కిలోకు రూ.5-9 దాకా పెరిగాయి. ప్రస్తుతం బియ్యం ధరలు కనీసం కిలో రూ.50, పాతవి అయితే రూ.59-70 దాకా ఉంటున్నాయి. కందిపప్పు ధర ఇప్పటికే డబుల్ సెంచరీ కొట్టింది. కిలో రూ.200-230 దాకా ఉంది. మినపపప్పు రూ.130-148 ఉండగా పెసరపప్పు రూ.160. శనగపప్పు మామూలు కన్నా రూ.30, రవ్వ, పల్లీల ధరలు రూ.10-20 దాకా పెరిగాయి. నెలరోజుల్లో వంట నూనెల ధరలు లీటరకు రూ.20 దాకా పెరిగాయి. 2 నెలల క్రితం రూ.115 ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ఇప్పుడు రూ.154. సబ్బులు, టీ పొడి వంటివి కూడా 10-15 శాతం పెరిగాయి. నాలుగైదు రోజులుగా ఉల్లి, టమాట ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఉల్లిగడ్డలు కిలో రూ.60గా ఉంది. కిలో టమాట ఇప్పుడు రూ.50-60 దాకా ఉంది. బీట్రూట్, క్యారెట్ ధర రూ.60 ఆలూ రూ.50, బెండ, దొండ, గోరు చిక్కుడు, వంకాయ రూ.40కి పైగా ఉన్నాయి.

# తాగునీటి కష్టాలు!




కరీంనగర్ : నగరంలో మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రంలో సాంకేతిక సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. 36 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్ నుంచి హైలెవల్ జోన్‌కు తాగునీటిని పంపింగ్ చేస్తుండగా.. ఇక్కడ ఏమాత్రం ఆలస్యం జరిగినా దాని ప్రభావం సరఫరాపై పడుతోంది. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడం, నిరంతర పర్యవేక్షణ ఉంటే తప్ప అవస్థలు తీరేలా లేవు. గత నెల 23న ఈ నీటిశుద్ధి కేంద్రంలో నీరు బయటకు వచ్చి ప్యానల్ బోర్డు పూర్తిగా తడిసింది. ఒకరోజు పూర్తిగా పంపింగ్ నిలిపి వేయడంతో తాగునీటికి నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపడంలేదు.

**పనిచేయని మోటార్లు**

రావాటర్‌ను ఫిల్టర్‌బెడ్‌లోకి తీసుకున్న తర్వాత పలుమార్లు శుద్ధి అవుతుంది. అక్కడి నుంచి క్లోరినేషన్, సంపులోకి పంపించాల్సి ఉంటుంది. పంపింగ్ చేసే సమయంలో పైపుల్లోని గాలిని బయటకు ముందుగా తీసేయాలి. దీనికోసం రెండు 5 హెచ్‌పీ సామర్థ్యం గల ఎయిర్ మోటార్లు నడిపించాల్సి ఉంటుంది. అందులో ఒక్కటే పని చేస్తుండగా ఆశించిన స్థాయిలో పైపుల నుంచి గాలి బయటకు రావడంలేదు. దీంతో నీరంతా బయటకు వస్తుంది. ఇలా పలుమార్లు జరగగా.. ఇటీవల నీరు ప్యానల్ బోర్డు వరకు చేరింది. పైగా పైపులకు లీకేజీలు ఉన్నాయి. మరో వైపు రెండు 370 హెచ్‌పీ మోటార్లు మూలనపడేశారు. నెల రోజుల్లో మరమ్మతులు చేస్తామని నాలుగు నెలల కిందట చెప్పిన అధికారులు.. ఆ విషయమే మర్చిపోయారు.

**కమిషనర్ ఆరా తీసినా..**

నీటి శుద్ధి కేంద్రాన్ని కొద్ది రోజుల కిందట నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంలో ఒకే నంబర్ గల మోటారును విరామం లేకుండా నడిపించడాన్ని గుర్తించి ఆరా తీసినా.. అధికారులు దాటవేశారు. ఎలాంటి సమాధానం ఇవ్వకపోగా.. మరమ్మతులు చేయాలని ఆదేశించినప్పటికి అధికారుల్లో చలనం లేదు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు మిషన్ భగీరథ ఏజెన్సీ వారే అయిదేళ్లు నిర్వహణ చూడాలి. మోటార్లు, పంపులకు మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.
– లచ్చిరెడ్డి, డీఈఈ, నగరపాలిక

# సంక్షేమ పథం!



కరీంనగర్ :'మార్పు కావాలంటే.. కాంగ్రెస్ రావాలంటూ'.. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో కొన్ని నెరవేర్చడంతోపాటు ఉద్యోగాల కల్పన.. గ్యారంటీల అమలు ద్వారా వివిధ వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి డిసెంబరు 7తో ఏడాది కావస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లావాసులకు వివిధ పథకాల ద్వారా కలిగిన లబ్ధిపై కథనం.

**గ్యాస్ 'రాయితీ'తో మేలు..**

రూ.500కు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుంది. ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకుంటున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో ప్రజాపాలనలో భాగంగా రేషన్‌కార్డు ఉన్న 8,13,880 మంది మహాలక్ష్మి పథకంలో భాగంగా రాయితీ సిలిండర్లు పొందాలని ఆశించారు. కానీ పౌరసరఫరాల శాఖ అధికారుల పరిశీలన తరువాత దాదాపుగా 6.12 లక్షల మంది అర్హులుగా గుర్తించారు. మొత్తంగా ప్రతినెల నగటున రూ.25కోట్ల రాయితీని జిల్లావాసులు అందుకుంటున్నారు. కొందరికి రెండు కనెక్షన్లు ఉండటం, ఇతర సాంకేతిక కారణాల వల్ల రాయితీ సాయం అందడం లేదు. వాటి విషయంలోనూ అధికారులు చొరవ చూపిస్తే బాగుంటుంది.

**'మాఫీ'తో రైతన్న ఖుషీ!**

రూ.2 లక్షల రైతు రుణ మాఫీని ఆరు గ్యారంటీల్లో ఒకటిగా ప్రకటించిన ప్రభుత్వం జులై 18న తొలి విడతలో రూ.లక్ష లోపు రుణం ఉన్న వారితో ఈ ప్రక్రియను ప్రారంభించింది. జులై 30న రెండో విడతలో రూ.లక్షన్నర లోపు ఉన్న వారికి పూర్తిచేసింది. ఆగస్టు మాసంలో రూ.2లక్షల్లోపు ఉన్నవారి ఖాతాల్లో ఈ నగదును జమచేసింది. సాంకేతిక సమస్యలతో మాఫీ కాని వారికి ఈ నెల 2వ తేదీన ప్రయోజనాన్ని అందించింది. 10 శాతం రైతులకు మాత్రం వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించలేదు. ఈ విషయమై త్వరలో సర్కారు నిర్ణయం తీసుకుని అందరి రుణాల్ని తీర్చేస్తే అన్నదాతలంతా ఆనందపడుతారు.

**ఆరోగ్యానికి రక్ష!**

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఆరోగ్యశ్రీ అండగా నిలుస్తోంది. ఆపద వేళల్లో ఆరోగ్యానికి రక్షగా మారుతోంది. గతంలో రూ.5 లక్షల వరకే ఉన్న ఆస్పత్రి బిల్లుల చెల్లింపును రూ.10 లక్షలకు పెంచడంతో నాలుగు జిల్లాల పరిధిలో రేషన్‌కార్డు ఉన్న వారికి ఇది మేలు చేస్తోంది. ఆస్పత్రుల సంఖ్యతోపాటు చికిత్సనందించే వివిధ రుగ్మతల సంఖ్యను పెంచడంతో అదనంగా 15 శాతం మంది ఈ పథకం కింద లబ్ధిని అందుకుంటున్నారు. 2023 డిసెంబరు 9వ తేదీ నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉమ్మడి జిల్లాలో 64,624 మందికి రూ.147.20 కోట్ల సాయం అందింది.

**గృహ జ్యోతి వెలుగులు**

తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో మొదలైన ఈ పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించుకున్నవారు బిల్లు కట్టనవసరం లేదు. ఈ పథకం పేద కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటునిస్తోంది. ప్రజాపాలనలో వచ్చిన అర్జీల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారు. 200 యూనిట్లకన్నా తక్కువ వినియోగిస్తే మాత్రమే ఆ వ్యయాన్ని సర్కారు భరిస్తుంది. ఇలా ఈ ఏడాది మార్చి నుంచి నవంబరు వరకు తొమ్మిది నెలల వ్యవధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50.75 లక్షలకుపైగా జీరో బిల్లులను వినియోగదారులు అందుకున్నారు. ఇందుకు సంబంధించి దాదాపుగా రూ.198.03 కోట్లను ప్రభుత్వమే విద్యుత్తు సంస్థకు చెల్లించింది.

# యాసంగి సాగుకు ప్రణాళిక

కరీంనగర్ : జిల్లాలో యాసంగి సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ ఖరారు చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,04,655 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి 2.65 లక్షల ఎకరాలు కాగా మొక్కజొన్న 26 వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు. యూరియా 42,416 మెట్రిక్ టన్నులు, డీఏపీ 7,796 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,339 మెట్రిక్ టన్నులు ప్రైవేట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**బోర్లు, బావులే ఆధారం**

జిల్లాలో ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిశాయి. బోర్లు, బావులు, ఎస్సారెస్పీ కాలువపై ఆధారపడి సేద్యం చేస్తున్నారు. గతేడాది 3,04,742 ఎకరాలు సాగుచేయగా.. ఈసారి 3,04,655 ఎకరాల సాగుకు ప్రణాళిక ఖరారు చేశారు. అంటే ఇంచుమించు గతేడాది మాదిరిగానే సాగు చేస్తున్నారు. ఇప్పటికే వానకాలం వరి పొలాలు కోసి, యాసంగికి నార్లు పోశారు. మొక్కజొన్న సాగు రైతులు సైతం రైతులు సిద్ధమయ్యారు. కొన్ని మండలాల్లో ఎస్సారెస్పీ కాలువపై ఆధారపడి సాగు చేస్తున్నారు.

**ఆరుతడి పంటలపై అనాసక్తి**

అన్నదాతలు ఆరుతడి పంటలైన పొద్దు తిరుగుడు, మినుములు వంటి పంటల సాగుకు ఆసక్తి చూపడంలేదు. ఈ పంటలకు నీరు తక్కువ మోతాదులో అవసరమైనప్పటికీ సాగుకు దూరంగా ఉంటున్నారు.




**అందుబాటులో విత్తనాలు, ఎరువులు**

జిల్లాలో యాసంగి సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చూస్తున్నాం. ఎక్కడైనా రైతులకు అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు అందితే డీలర్లపై చర్యలు తీసుకుంటాం.
– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి, కరీంనగర్

## ప్రభావం తక్కువైనా అప్రమత్తత తప్పనిసరి

హైదరాబాద్ : దక్కన్ పీఠభూమి స్థిరమైన కఠిన శిలతో కూడిన ఎత్తైన భూమి కావడంతో ఈ ప్రాంతంలో భూకంపాల ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని, అయితే వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాల్సి ఉందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్‌బోర్డు (సీజీడబ్ల్యూబీ) సదరన్ రీజినల్ రిటైర్డ్ డైరెక్టర్, శాస్త్రవేత్త ఎం.వీరన్న అభిప్రాయపడ్డారు. సుమారు ఐదు దశాబ్దాల క్రితమే గోదావరి వ్యాలీలోని ములుగు ప్రాంతంలో భూగర్భజలాలు, ఇతర వనరుల అన్వేషణ కోసం వివిధ జాతీయ సంస్థలు అధ్యయనం చేశాయన్నారు. అక్కడ భూమిలోని విభిన్న పరిస్థితుల నేపథ్యంలో భూ పొరల్లో సర్దుబాట్ల వల్ల తాజా ప్రకంపనలు వచ్చాయని.. గోదావరి లోయతో అనుసంధానమైన ప్రాంతాల్లో ఆ ప్రభావం ఉందని తెలిపారు. తెలంగాణలో 1843లో ఆదిలాబాద్ ప్రాంతంలో వచ్చిన భూకంపం తీవ్రత 3.7 కాగా, అప్పటి నుంచి వచ్చిన వాటి వివరాలు అందుబాటులో ఉ



న్నాయన్నారు. తీవ్రత ఐదు అంతకంటే ఎక్కువ నమోదైన ఘటనలు మూడుసార్లే ఉన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నమోదవుతున్న ప్రకంపనలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేకున్నా భారీగా కట్టడాల నేపథ్యంలో.. జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని తెలిపారు. **హైదరాబాద్‌లో ఎలాంటి అప్రమత్తత అవసరం?:** హైదరాబాద్ భూకంపాల కేటగిరి రెండులో ఉంది. ఈ ప్రాంతం ప్రాచీనమైన దక్కన్ పీఠభూమిలో భాగం. భూకంపాల ప్రభావం చాలా తక్కువ. సాధారణంగా ఇక్కడ నమోదయ్యే వాటి తీవ్రత రెండు లేదా మూడు వరకు ఉండొచ్చు. ఎత్తైన, భారీ అంతస్తుల నిర్మాణం విషయంలో భూమి స్వభావంపై అధ్యయనం చేపట్టాలి.

**గోదావరి లోయ ప్రత్యేకతలు** గోదావరి లోయ భిన్నమైంది...ప్రాచీనమైంది. ఈ లోయ ప్రాణహిత నుంచి సముద్రం వరకు విస్తరించింది. గతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు 1976-77లో ములుగు ప్రాంతంలో కీలక అధ్యయనాలు చేశాయి. సెంట్రల్‌గ్రౌండ్ వాటర్‌బోర్డు, ఓఎన్‌జీసీ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌లో జియోలాజికల్ స్టడీ విభాగం పలు అధ్యయనాలు చేపట్టాయి. భూగర్భజలాల మ్యాపింగ్‌తో పాటు వివిధ రకాల భూగర్భ నిక్షేపాలపై ఇవి కొనసాగాయి.

## చొరవ లేక.. పనులు సాగక

హైదరాబాద్ : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ) నత్తనడకన సాగుతోంది. సకాలంలో నిధులు విడుదల చేయలేకపోవడంతో పనుల పురోగతి గాడి తప్పుతోంది. పైవంతెనలు, ఆర్వోబీల నిర్మాణ వేగం తగ్గిపోయింది. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. గత సర్కారు చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాది గడిచినా పెద్దగా మార్పు కనిపించడం లేదు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు ఎవరూ పెద్దగా దృష్టి



సారించకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది.

**ఇదొక్కటే బాగు..** జూపార్కు, ఆరాంఘర్ చౌరస్తాల మధ్య నిర్మించిన పైవంతెన ఒక్కటే చకచకా సాగింది. ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మిగిలిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఒవైసీ ఆస్పత్రి నుంచి నల్గొండ ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది.

**భూసేకరణ కష్టాలు..**

గత ప్రభుత్వం ఎస్సార్డీపీ పేరుతో నగరవ్యాప్తంగా అండర్‌పాస్‌లు, ఆర్వోబీ, ఆర్‌యూబీ, పైవంతెనలు కలిపి 35 పనులను చేపట్టింది. వాటిల్లో ఆరు పనులు పురోగతిలో ఉన్నాయి.

జూ పార్కు- ఆరాంఘర్ పైవంతెన ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. నాలుగు కి.మీ పొడవున ఉన్న పైవంతెనకు రెండు చోట్ల ఇరువైపులా కలిపి నాలుగు ర్యాంపులు నిర్మించాల్సి ఉంది. నిధుల సమస్యతో వీటిని తర్వాత నిర్మిద్దామనుకున్నారు. ముందుగా పైవంతెనను అందుబాటులోకి తీసుకొద్దామని నిర్ణయించారు. జూపార్కు ఎదురుగా ఉన్న ఐదు నిర్మాణాలను తొలగిస్తే తప్ప ప్రారంభోత్సవం జరపలేని పరిస్థితి ఉంది. అందుకే కమిషనర్ నిధులు అందజేశారు. ప్రస్తుతం నిర్మాణాల కూల్చివేత జరుగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో సర్వీసు రోడ్డును బాగు చేసి పైవంతెనను ప్రారంభిస్తామని ఇంజినీర్లు చెబుతున్నారు.

ఫలక్‌నుమా ఆర్వోబీ నిర్మాణం నత్తకు నడక నేర్పుతోంది. నాలుగేళ్ల క్రితం పనులు మొదలయినా.. సగం పనులే పూర్తయ్యాయి. ఇరుకు రోడ్డుపై రాకపోకలు సాగించలేక వాహనదారులు అవస్థ పడుతున్నారు. గడిచిన ఏడాదిలో కేవలం 11శాతం పనులే జరిగాయి.

భూసేకరణ, రైల్వే శాఖ చేపట్టాల్సిన నిర్మాణ పనులతో శాస్త్రిపురం ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

ఉప్పల్ నుంచి నారపల్లి వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. దాన్ని కూడలిలోని మెట్రో మార్గం పైనుంచి ఉప్పల్ క్రికెట్ స్టేడియం వైపునకు మళ్లిస్తూ చేపట్టిన పనులు పిల్లర్ల నిర్మాణం దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 8శాతం పనులే జరిగాయి.



# అందుకే మనస్ఫూర్తిగా క్షమాపణ కోరా

పిఠాపురం: ఆవు బాగుంటే రైతు బాగుంటాడని.. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో 268 గోకులం షెడ్లు నిర్మిస్తే.. ఆరు నెలల్లో తాము 12,500 నిర్మించామని చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పవన్ మాట్లాడారు. "గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు, ఇతర వర్గాలు బాగుపడతాయి. భవిష్యత్తులో 20వేల గోకులాలు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసింది. స్కామ్‌ల్లో రికార్డు సృష్టించింది. మా ప్రభుత్వం పల్లె పండుగ, గోకులాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసింది. సకాలంలో జీతాలు, పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయి.

రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నాం. ఎన్డీయే, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి మీరంతా ఓట్లు వేశారు. ఎక్కడ తప్పు జరిగినా స్పందించే గుణం ఉండాలి. తప్పు జరిగితే అది మా అందరి సమష్టి బాధ్యత. అందుకే తిరుపతి తొక్కిసలాట ఘటనపై స్పందించాను... మనస్ఫూర్తిగా క్షమాపణ కోరా.

**ఎలా స్పందించాలో తెలియాలి..** ఎక్కడ ఎలా స్పందించాలో అభిమానులకు తెలియాలి. ప్రమాద సమయాల్లో కేరింతలు అనవసరం. కేరింతలు.. అరుపులు కాదు.. పోలీసులకు సహకరించాలి. తిరుపతి ఘటన చూశాం.. ఎవరి బాధ్యత వాళ్లు సరిగా చేస్తే సరిపోయేది. కొంతమంది చేసిన తప్పునకు జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తం ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. ఉద్యోగి, అధికారి.. ఎవరైనా వారి బాధ్యతలు సరిగా నిర్వర్తించాలి. గత ప్రభుత్వంలో అలవాటుపడి కొంతమంది పనిచేయడం మానేశారు. న్యాయం అందరికీ జరిగేలా చూడటం ముఖ్యం. తప్పు చేస్తే నన్ను కూడా శిక్షించాలని అసెంబ్లీలో చెప్పా. రాజ్యాంగం ఇచ్చిన విధులను సంపూర్ణంగా పరిరక్షించాలని మనస్ఫూర్తిగా అధికారులను కోరుతున్నా. చాలా పెద్ద మనసుతో.. గొడ్డు చాకిరీ చేయడానికి వచ్చా.

**తితిదే ఛైర్మన్, సభ్యులు క్షమాపణ చెప్పాలి :** నాకు అధికారం అలంకారం కాదు.. బాధ్యత. ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తొక్కి నార తీస్తా. చేయని తప్పునకు జపాన్ ప్రధాని క్షమాపణ చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్, సభ్యులు ప్రెస్‌మీట్ పెట్టి క్షమాపణలు చెప్పాలి.

నేను క్షమాపణ చెప్పినప్పుడు.. మీరు చెప్పడానికి ఏంటి నామోషీ? మీ తప్పు లేదంటే ఎలా? నేను మాత్రం దోషిగా నిలబడాలా? వీఐపీ ట్రీట్‌మెంట్ తగ్గి.. కామన్ మ్యాన్ ట్రీట్‌మెంట్ పెరగాలి.

**విప్లవకారుడు రాజకీయ నాయకుడైతే ఇలాగే ఉంటుంది :** నాతో సహా అందరికీ 6 నెలల పాలన పూర్తయింది. మీరు నన్ను నమ్మి గెలిపించారు.. నిలబెట్టి పనిచేయిస్తాను. ఒళ్లు వంచి పని చేసిన తర్వాతే ఓట్లు అడుగుతాను. 15 ఏళ్లకు తక్కువ కాకుండా కూటమి ఉండాలని కోరుకుంటున్నా. అధికార యంత్రాంగం సహకారం కావాలి. పిఠాపురం నుంచి జిల్లాల పర్యటన మొదలుపెడుతా. బాధ్యతగా ఉంటాను.. నాయకులను కలుపుకొని వెళ్తాను. విప్లవకారుడు రాజకీయ నాయకుడైతే ఇలాగే ఉంటుంది. నాకు డబ్బు, పేరు మీద ఇష్టం లేదు. బాధ్యత మాత్రమే ఉంది. నాకు దేవుడు అవసరమైనంత డబ్బు, పేరు ఇచ్చాడు. ప్రజలు ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని పవన్ అన్నారు.




## ఉద్యోగ నోటిఫికేషన్ల పరీక్ష తేదీలు ప్రకటించిన ఏపీపీఎస్సీ

అమరావతి: ఉద్యోగ నోటిఫికేషన్ల పరీక్ష తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం ప్రకటించింది. 8 నోటిఫికేషన్లకు సంబంధించి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆన్‌లైన్ విధానంలో ఏప్రిల్ 27 నుంచి 30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం https://portal-psc.ap.gov.in లో చూడాలని ఏపీపీఎస్సీ తెలిపింది.

## రోడ్డు పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



రాజమహేంద్రవరం: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం పర్యటనకు వెళ్లారు. రాజమహేంద్రవరం నుంచి పిఠాపురం వెళ్లే మార్గంలో రామస్వామిపేట వద్ద ఏడీబీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు? ఎంతవరకు పనులు పూర్తయ్యాయి? తదితర వివరాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఇతర అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వెంట కాలినడకన వెళ్తూ డ్రెయిన్ సౌకర్యం, నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. దీంతో పాటు ఇటీవల గేమ్‌ఛేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్ సమయంలో వడిశలేరు వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అభిమానులు మృతిచెందిన ప్రాంతాన్ని పవన్ పరిశీలించారు.

ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో భవన నిర్మాణాల అనుమతులకు నిబంధనలు సులభతరం.. ఉత్తర్వులు జారీ

అమరావతి: ఏపీలో భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల నిబంధనలు సులభతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్-2017, ఏపీ ల్యాండ్ డెవలప్‌మెంట్ రూల్స్ - 2017లో సవరణలు చేస్తూ వేర్వేరుగా జీవోలు జారీ అయ్యాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు కీలక సంస్కరణలతో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. లేఅవుట్లలో రోడ్లకు గతంలో ఉన్న 12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదించారు.

500 చ.మీ. పైబడిన స్థలాల్లో నిర్మాణాన్ని సెల్లారుకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. టీడీఆర్ బాండ్ల జారీలో కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగించారు. రాష్ట్ర, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధనను పక్కన పెట్టారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది.




**సంక్రాంతి కానుకగా నిబంధనల్లో మార్పులు: మంత్రి నారాయణ..** సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ జీవోలు జారీ అయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేశామని తెలిపారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకుంటుందని మంత్రి అన్నారు.

## పోక్సో కేసు.. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ



అమరావతి: వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.

గతంలో బాలికపై అత్యాచారం జరిగిందని అసత్య ప్రచారం చేశారని ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు తిరుపతి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు చెవిరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

**అసలేం జరిగిందంటే..** తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక (14)పై అత్యాచారం జరిగిందని వ్యాఖ్యానించడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారన్న ఆరోపణలతో చెవిరెడ్డిపై కేసు నమోదైంది. వాస్తవాలు నిర్ధారించుకోకుండా అసత్య ప్రచారం చేయడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోక్సో కేసు పెట్టారు. యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక.. పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా ముసుగు వేసుకున్న దుండగులు తనపై దాడిచేసి మత్తు మందు తాగించారని తల్లిదండ్రులను నమ్మించింది. ఘటన పూర్వాపరాలు తెలుసుకోకుండా, వాస్తవాలు నిర్ధరించుకోకుండానే బాలిక చదివే పాఠశాలకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.. ఆమెపై అత్యాచారం జరిగిందని, ఆమెకు అండగా ఉంటామని వ్యాఖ్యానించినట్లు పోలీసులు గుర్తించారు. బాలికకు వైద్యపరీక్షలు చేసి అత్యాచారం జరగలేదని పోలీసులు తెలిపినా, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసినట్లు తేల్చారు. ఈ కేసులో బాధితురాలు బాలిక కావడం వల్ల.. ఆమెతోపాటు కుటుంబసభ్యుల గుర్తింపు ప్రచారం చేయడం పోక్సో చట్టం ప్రకారం ఉల్లంఘన అవుతుంది. అసత్య ప్రచారం చేసి తమను మనోవేదనకు గురిచేశారంటూ బాలిక తండ్రి ఆయనపై ఫిర్యాదు చేశారు.



## విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగిస్తోన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా కోచ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 16 కోచ్‌లతో నడుస్తోన్న విశాఖ-సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అదనంగా మరో 4 కోచ్‌లను జత చేసింది. అదనపు కోచ్‌లు జనవరి 11 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. మరో 4 కోచ్‌లు పెంచడం ద్వారా ప్రస్తుతం 1,128గా ఉన్న సీటింగ్ కెపాసిటీ 1,414కి చేరనుంది. నాలుగు కోచ్‌లు అదనంగా జత చేశాక ఛైర్‌కార్ బోగీల సంఖ్య 14 నుంచి 18కి పెరిగింది. సీటింగ్ కెపాసిటీ 1,024 నుంచి 1,336కు చేరుకుంది. ప్రస్తుతం ఉన్న రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీల సంఖ్యలో ఎలాంటి మార్పు చేయలేదు.

ఈ రెండు బోగీల్లో 104 మంది ప్రయాణం చేయొచ్చు. దీంతో మొత్తం సీటింగ్ కెపాసిటీ 1,414కి చేరినట్లు అయింది.





## టీటీడీకి నూతన ఈవో, ఏఈవో - ఆ ఇద్దరికే ఛాన్స్, ముహూర్తం ఫిక్స్..!?

తిరుమల ప్రక్షాళన దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. తిరుపతి లో తొక్కిసలాట వేళ తిరుమల లో చోటు చేసుకుంటున్న పరిణామాల పై చంద్రబాబు, పవన్ ఆగ్రహంగా ఉన్నారు. టీటీడీలో పూర్తి స్థాయిలో మార్పులు జరగాలని పవన్ డిమాండ్ చేసారు. ఈవో, ఏఈవో పైన సీరియస్ అయ్యారు. చంద్రబాబు సమక్షంలోనే ఛైర్మన్ - ఈవో వాగ్వాదం ను సీఎం తీవ్రంగా పరిగణించారు.

దీంతో, ఈ రోజు ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనం పది రోజులు పూర్తయిన తరువాత ఈవో..ఏఈవో మార్పు ఖాయమని తెలుస్తోంది. ఈవోగా కీలక అధికారి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**టీటీడీ ప్రక్షాళన...** కోట్లాది మంది భక్తులు విశ్వసించే తిరుమల బాధ్యత టీటీడీ పై ఉంది. టీటీడీలో ఛైర్మన్, ఈవో, ఏఈవో ది కీలక పాత్ర. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏరి కోరి ఈ మూడు స్థానాల్లో నియామకాలు జరిగాయి. కానీ, ఏడు నెలల కాలంలో నే ఈ ముగ్గురి మధ్య సమన్వయం లేకపోవటంతో పాటుగా ఎవరికి వారే తామే నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలనే విధంగా వ్యవహరిస్తున్న శైలి వివాదాస్పదంగా మారింది. తిరుపతి తొక్కిసలాట ఘటన పై చంద్రబాబు సమీక్షలోనే ఛైర్మన్ , ఈవో ఏకవచనంతో వాగ్వాదానికి దిగటాన్ని సీరియస్ గా తీసుకున్నారు. అదే సమయంలో పవన్ సైతం ఈవో, ఏఈవో మధ్య సమన్వయం లేదని ఆగ్రహం వ్యక్తం చేసారు.

**చంద్రబాబు - పవన్ సీరియస్...** తాజా ఘటనకు బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని పవన్ స్పష్టం చేసారు. తాజా ఘటన పైన పవన్ భక్తులకు క్షమాపణ చెప్పారు. లక్షలాది భక్తులు హాజరయ్యే వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పైన 15 సమావేశాలు జరగ్గా.. వాటిల్లో ఛైర్మన్ - ఈవో కలిసి ఒకే సారి పాల్గొనటం ద్వారా ఏ స్థాయిలో వీరి మధ్య గ్యాప్ ఉందనేది స్పష్టం అవుతోంది. ఈవో శ్యామలరావు, ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఎవరికి వారు తామదే నిర్ణయాధికారం అనే విధంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. కొద్ది రోజుల క్రితం ఛైర్మన్ నాయుడు సీఎం చంద్రబాబు ను కలిసి ఈవో పై ఫిర్యాదులు చేసారు. దీంతో, ఈవోను పిలిపించి చంద్రబాబు కలిసి పని చేసుకోవాలని.. సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

**కీలక కసరత్తు...** కానీ, వీరి మధ్య సయోధ్య లేదని తాజాగా చంద్రబాబు సమీక్షలో స్పష్టమైంది. సీఎం సమక్షంలోనే వారిద్దరూ తీవ్రస్థాయిలో మాటల ఘర్షణకు దిగడం కలకలం రేపింది. దీంతో టీటీడీ వ్యవహారాలను చక్కదిద్దాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఏఈవో వెంకయ్య చౌదరి పైనా ఫిర్యాదులు ఉన్నాయి. పవన్ సైతం వీరి విషయంలో గుర్రుగా ఉన్నారు. దీంతో, ప్రస్తుతం సీఎంఓలో పని చేస్తున్న కీలక అధికారికి టీటీడీ ఈవోగా బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. శ్యామలారావును తిరిగి గతం లో పని చేసిన శాఖకు పంపే ఛాన్స్ ఉందని సమాచారం. ఏఈవో స్థానంలో ప్రభుత్వంలోని ముఖ్య శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న యువ అధికారి నియామకం పైన పరిశీలన చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో, ఇప్పుడు టీటీడీ ప్రక్షాళనలో భాగంగా చంద్రబాబు తీసుకునే నిర్ణయాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.




తిరుమల: తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని ఫల, పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో ఆలయ పరిసరాలు వెలిగిపోతున్నాయి. వివిధ రకాల ఆకారాలలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ చూపరులను ఆకట్టుకుంటుంది.

## అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం ప్రశ్నించారు: మంత్రి ఆనం



నెల్లూరు: తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం చంద్రబాబు ప్రశ్నించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా.. 35 మందికి గాయాలయ్యాయని చెప్పారు. క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి స్విమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. చనిపోయిన ఆరుగురికి వెంటనే పోస్టుమార్టం నిర్వహించినట్లు మంత్రి వివరించారు. రెవెన్యూ అధికారి సమక్షంలో మృతదేహాలను స్వస్థలాలకు తరలించామన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడారు. "స్పృహ తప్పిన మహిళను బయటకు తీసుకెళ్లే సమయంలో తొక్కిసలాట జరిగిందని కొంతమంది చెప్పారు. టోకెన్లు ఇస్తున్నారన్న ఆతృతతో అందరూ ఒక్కసారిగా గేట్ల మీద పడ్డారు. ఒకవైపు తెరవాల్సిన గేట్లు.. మరోవైపు తెరవడంతో తొక్కిసలాట జరిగినట్లు చాలామంది తెలిపారు. సుమారు గంటన్నరపాటు 35 మంది క్షతగాత్రులను సీఎం వ్యక్తిగతంగా కలిశారు. ఏం చేస్తే త్వరగా కోలుకుంటారని వైద్యులను కూడా సీఎం అడిగారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని రూ.25లక్షల చొప్పున సాయం ప్రకటించారు" అని మంత్రి వివరించారు.

# కుంభకోణాల కథలో కాజల్

భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా ప్రయాణిస్తున్న అందాల తార కాజల్.. ఇప్పుడు మరో కొత్త హిందీ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. ఆమె, బాలీవుడ్ నటుడు శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో 'ది ఇండియా స్టోరీ' అనే సినిమాలో




నటిస్తున్నారు. చేతన్ డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ గురువారం నుంచి ముంబయిలో ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఫొటోలను పంచుకున్నారు శ్రేయాస్. "ది ఇండియా స్టోరీ' ప్రయాణం మొదలైంది. మునుపెన్నడూ తెరపైకి రాని శక్తిమంతమైన కథతో రాబోతున్నాం" అని వ్యాఖ్యల్ని జోడించారు. క్రిమిసంహారక మందుల కంపెనీల్లోని కుంభకోణాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని, త్వరలో పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. సాగర్ బి.షిండే నిర్మిస్తున్న ఈ ఇంటెన్స్ డ్రామా ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# తారక్ వర్సెస్ తారక్!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ వార్ -2తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తోన్న చిత్రమిది. ఆయాన్ ముఖర్జీ భారీ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తారక్-హృతిక్ మధ్య భారీ యాక్షన్ సన్నివేశాలుంటాయని ప్రచారంలో ఉంది. అలాగే ఇద్దరి మధ్య ఓ స్పెషల్ సాంగ్ సైతం ఉంటుందని వినిపిస్తుంది. ఇద్దరు మంచి డాన్సర్లు కావడంతో అందులో పోటా పోటీ తప్పదు. ప్రస్తుతం షూటింగ్ ముంబైలో వేసిన ప్రత్యేక సెట్లలో జరుగుతోంది. అందులో తారక్ కూడా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. తారక్ ఇందులో రెండు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించనున్నారట. దీనిలో



భాగంగా తారక్ వర్సెస్ తారక్ అన్నట్లు ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఆ రెండు పాత్రల మధ్య ఉంటుందని బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వార్‌లో కూడా టైగర్ ష్రాఫ్ రెండు డిఫరెంట్ షేడ్స్ లో కనిపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తారక్ పాత్రని మరింత బలంగా చూపించబోతున్నారట. దీంతో తారక్ పై ఆ యాక్షన్ ఎపిసోడ్ ఎలా ఉంటుందనే ఆసక్తి పెరిగిపోతుంది. ఈ సినిమాకి హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు, టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలు ఎంతో క్రియేటివ్ గా రియలిస్టిక్ గా తీర్చిదిద్దుతున్నారట. యాక్షన్ సన్నివేశాలకే భారీగా ఖర్చు చేస్తున్నారుట. ఆ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా ముందుకెళ్తున్నారట. తారక్ పై చిత్రీకరణ కూడా దాదాపు ముగింపు దశకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెలఖరుతో తారక్ పోర్షన్ షూటింగ్ పూర్తవుతుందంటున్నారు. షూటింగ్ అంతా ఏప్రిల్ కల్లా ముగిస్తారని వార్తలొస్తున్నాయి.




# గేమ్ ఛేంజర్.. రామ్‌చరణ్, శంకర్ కాంబో ఎలా ఉంది?



చిత్రం: గేమ్ ఛేంజర్‌బీ నటీనటులు: రామ్‌చరణ్, కియారా అడ్వాణీ, అంజలి, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, జయరామ్, నవీన్ చంద్ర, వెన్నెల కిషోర్, బ్రహ్మానందం, రాజీవ్ కనకాల తదితరులుబీ సంగీతం: తమన్‌బీ సినిమాటోగ్రఫీ: తిరుబీ ఎడిటింగ్: సమీర్ మహ్మద్, రుబెన్‌బీ కథ: కార్తిక్ సుబ్బరాజ్‌బీ నిర్మాత: దిల్‌రాజుబీ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎస్.శంకర్‌బీ విడుదల: 10-01-2025

కలయికతోనే అంచనాలు పెంచిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. లార్జర్ దేన్ లైఫ్ సినిమాలకి పెట్టింది పేరైన తమిళ దర్శకుడు శంకర్ తెలుగులో తీసిన తొలి చిత్రం ఇదే. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించడం మరో ప్రత్యేకం. ఐదేళ్ల తర్వాత వస్తున్న రామ్‌చరణ్ సోలో చిత్రం ఇదే కావడం... అగ్ర దర్శకుడు శంకర్ తెరకెక్కించడం, దిల్‌రాజు భారీ నిర్మాణవ్యయంతో రూపొందించడంతో ఈ సినిమా ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచింది. మరి ఆ అంచనాలు, ఆసక్తికి దీటుగా ఉందా? ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించింది?

**కథేంటంటే:** రామ్‌నందన్ (రామ్‌చరణ్) ఓ యువ ఐపీఎస్ అధికారి. కాలేజీలో తను ప్రేమించిన దీపిక (కియారా అడ్వాణీ) కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకుంటాడు. తనలో కోపాన్ని తగ్గించుకుంటాడు. ఆమె కోసమే ఐపీఎస్ నుంచి ఐఏఎస్ అవుతాడు. విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోగానే మినిస్టర్ బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య), అతని గ్యాంగ్‌తో యుద్ధం మొదలవుతుంది. అభ్యుదయ పార్టీకి చెందిన మోపిదేవి తండ్రే ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్). పదవుల కోసం ఆరాటపడే మోపిదేవి ముఖ్యమంత్రి పదవి కోసం ఎలాంటి ఎత్తులు వేశాడు? అడ్డొచ్చిన ఐఏఎస్ అధికారి రామ్‌నందన్‌ని అధికార బలంతో ఏం చేశాడు? సమర్థుడైన రామ్‌నందన్.. మోపిదేవికి ఎలాంటి బదులిచ్చాడు? అభ్యుదయ పార్టీ, అప్పన్న (రామ్‌చరణ్), పార్వతి (అంజలి)తో రామ్‌నందన్‌కి ఉన్న సంబంధమేమిటన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

**ఎలా ఉందంటే:** శంకర్ గతంలో ఒకే ఒక్కడు, శివాజీ తదితర సినిమాల్లో స్పృశించినట్టుగానే వ్యవస్థ, ప్రక్షాళన చుట్టూ సాగే కథ ఇది. ఓ యువ ఐఏఎస్ అధికారికీ, రాజకీయ నాయకుడికీ మధ్య సాగే ఓ యుద్ధం. అక్కడక్కడా శంకర్ మార్క్ విజువల్స్, అప్పన్న ఎపిసోడ్, కొన్ని మెరుపులు మినహా... కథనం, భావోద్వేగాల పరంగా పెద్దగా మనసుల్ని తాకలేదు. వాస్తవికతతో కూడిన సినిమాల్ని ఇష్టపడుతున్న తరం ఇది. వాళ్లకు తెరపై ఇదివరకెప్పుడూ చూడని కొత్త ప్రపంచాన్నైనా చూపించాలి. లేదంటే, వాస్తవానికి దగ్గరగా అనిపించే కథనైనా అందించాలి. ఈ రెండింటికీ కాస్త దూరంగా సాగింది శంకర్ 'గేమ్..'.

**ఎవరెలా చేశారంటే:** రామ్‌చరణ్ మూడు కోణాల్లో సాగే పాత్రలో తెరపై కనిపిస్తాడు. యాంగ్రీ యంగ్‌మ్యాన్‌గా, అప్పన్నగా, పబ్లిక్ సర్వెంట్‌గా మంచి నటనని ప్రదర్శించాడు. ఆయన లుక్స్ కూడా ఆకట్టుకుంటాయి. అప్పన్న పాత్రలో ఆయన నటన మరింతగా ఆకట్టుకుంటుంది. కియారా అడ్వాణీ పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. పాటల్లో మాత్రం అందంతో కట్టిపడేస్తుంది. అంజలి నటనకి ప్రాధాన్యమున్న పార్వతి పాత్రలో అలరించింది. ఆమె రెండు రకాల లుక్స్‌తో కనిపిస్తారు. ఆమె పాత్ర నేపథ్యంలోనే భావోద్వేగాలు పండాయి. మినిస్టర్ మోపిదేవిగా ఎస్.జె.సూర్య నటన సినిమాకి హైలైట్. హుషారైన తన నటనతో విలనిజం పండిస్తూనే, అక్కడక్కడా నవ్వించాడు. శ్రీకాంత్ కూడా రెండు లుక్స్‌తో సందడి చేస్తారు. కథని మలుపుతిప్పే కీలక పాత్ర ఆయనది. జయరాం, సముద్రఖని, రాజీవ్ కనకాల ప్రాధాన్యమున్న పాత్రల్లో కనిపిస్తారు.

# సీక్రెట్ మిషన్ లో టాలెంటెడ్ బ్యూటీ



అడివి శేష్ హీరోగా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గూఢచారి 2'. 'గూఢచారి'కి సీక్వెల్ గా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇక వినయ్ కుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకి అడివి శేష్ కథ అందించారు. పాన్ ఇండియా రేంజ్ లో రెడీ అవుతోన్న ఈ ప్రాజెక్ట్ ని మొదటి సినిమా కంటే మూడు రేట్లు ఎక్కువ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. పీపుల్స్ మీడియాతో పాటుగా అభిషేక్ అగర్వాల్, ఏకే ఎంటర్టైన్మెంట్స్ కూడా ఇందులో భాగం కావడం విశేషం. కచ్చితంగా అడివి శేష్ 'గూఢచారి 2'తో కూడా ఆడియన్స్ ని థ్రిల్ చేస్తాడని అనుకుంటున్నారు. మూవీ షూటింగ్ ఎప్పుడో స్టార్ట్ అయ్యింది. అయితే కొన్ని కీలక పాత్రల కోసం కొంతమంది టాలెంటెడ్ నటీనటులను తీసుకుంటున్నారు. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బిని కీలక పాత్ర కోసం ఎంపిక చేసినట్లు మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. అడివి శేష్ తో కలిసి ఆమె ఉన్న ఫోటోని షేర్ చేసి అఫీషియల్ గా వామికా ఈ చిత్రంలో భాగమైనట్లు చెప్పారు. ఫీమేల్ లీడ్ కోసమే ఆమెని ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. 2007లోనే నటిగా కెరియర్ స్టార్ట్ చేసిన వామిక గబ్బి ఆరంభంలో సైడ్ క్యారెక్టర్స్, ఫ్రెండ్ రోల్స్ చేస్తూ వచ్చేది. తరువాత లీడ్ యాక్టర్ గా మారింది. తెలుగులో ఆమె సుధీర్ బాబుకి జోడీగా 'భలే మంచి రోజు' అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కమర్షియల్ హిట్ అయ్యింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఆ సినిమా తెరకెక్కింది. తరువాత తమిళంలో ఓ చిత్రంలో నటించింది. అయితే ఈ బ్యూటీ ఎక్కువగా పంజాబీ, హిందీ సినిమాలలోనే నటిస్తోంది. రీసెంట్ గా హిందీలో రిలీజ్ అయిన 'బేబీ జాన్' చిత్రంలో వామికా గబ్బి హీరోయిన్ గా చేసింది. అయితే ఈ మూవీ కమర్షియల్ సక్సెస్ కాలేదు. ఇప్పుడు ఊహించని విధంగా ఏకంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయిన 'గూఢచారి 2'లో లీడ్ యాక్టర్ గా ఎంపిక కావడం విశేషం. కచ్చితంగా ఈ సినిమా ఆమెకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నారు. అడివి శేష్ ఈ ప్రాజెక్ట్ పైన చాలా నమ్మకంతో ఉన్నారు. మేజర్ తో పాన్ ఇండియా రేంజ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న అడివి శేష్ 'గూఢచారి 2'తో మరో గ్రాండ్ విక్టరీ అందుకోవాలని అనుకుంటున్నాడు. అందుకే బాలీవుడ్ క్యాస్టింగ్ ని ఈ మూవీ కోసం ఎంపిక చేస్తున్నారు. ఇక 'గూఢచారి 2' మూవీలో ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడు. అతని పాత్ర చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రంతో పాటు పవన్ కళ్యాణ్ పాన్ ఇండియా మూవీ 'ఓజీ'లో కూడా ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు.

# ఆలోచనను రేకెత్తించే అనూజ


ఓవైపు హాలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా గడుపుతూనే.. మరోవైపు అవకాశం వచ్చినప్పుడల్లా నిర్మాతగా కూడా నిరూపించుకుంటుంది బాలీవుడ్ నాయిక ప్రియాంక చోప్రా ఇప్పుడామె నిర్మాతగా ఆస్కార్ బరిలోకి అడుగుపెట్టింది. ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన లఘు చిత్రం 'అనూజ'. ఇది ఇటీవలే ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో స్థానం సంపాదించుకొని సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. తాజాగా దీనికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపింది ప్రియాంక చోప్రా. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ అందమైన చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల మంది పిల్లలను




ప్రభావితం చేసే అంశంపై దృష్టి సారిస్తుంది. 'అనూజ' ప్రేక్షకుల్లో ఒక పదునైన ఆలోచనను రేకెత్తిస్తుంది. ఇంత గొప్ప చిత్రం ఆస్కార్ రేసులో నిలవడం ఆనందంగా ఉంది. ఇది మన జీవిత గమనాన్ని మార్చే సినిమా. ఇలాంటి అద్భుతమైన ప్రాజెక్టులో నేను భాగమయ్యినందుకు గర్వపడుతున్నా" అని చెప్పుకొచ్చింది. ఒక గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే తొమిదేళ్ల అనూజ అనే అమ్మాయి.. భవిష్యత్తు కోసం అన్వేషించే మార్గంలో సమాజంలో తనకు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు. గునీత్ మోంగా నిర్మించారు. మరోవైపు అమెరికా లాస్‌ఏంజెలెస్‌ను కార్చిచ్చు చుట్టుముట్టిన నేపథ్యంలో ఆస్కార్ నామినేషన్ల ప్రకటనను వాయిదా వేసినట్లు తెలిపింది అకాడెమీ బృందం. కార్చిచ్చు వల్ల ఓటింగ్ ప్రక్రియ ఆలస్యమవుతుందని, ఈ నేపథ్యంలోనే నామినేషన్లను ఈ నెల 19న ప్రకటించనున్నట్లు తెలిపారు.

# పండోరా గ్రహంపై కీర్తి సురేష్ హనీమూన్

మహానటి కీర్తి సురేష్ ప్రేమించిన సఖుడు ఆంటోనీని పెళ్లాడిన సంగతి తెలిసిందే. దుబాయ్ కేంద్రంగా పలు దేశాల్లో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించిన ప్రముఖ బిజినెస్ మేన్ ఆంటోని తట్టిల్ కి కీర్తి చాలా కాలంగా స్నేహితురాలు. ఈ జంట కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నారు. చివరికి పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లితో కీర్తి లైఫ్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. కీర్తి పెళ్లి తర్వాత నటిస్తుందా లేదా? అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ప్రస్తుతానికి కీర్తి సురేష్ హనీమూన్ కోసం ఎక్కడ ప్లాన్ చేసింది? అంటూ అభిమానుల్లో సందేహాలు ఉన్నాయి. కొత్త సంవత్సర వేడుకల కోసం కీర్తి ఒక ఎగ్జోటిక్ లొకేషన్ కి వెళ్లింది. ఇదే లొకేషన్ కీర్తి- ఆంటోని జంటకు హనీమూన్ డెస్టినేషన్ అయిందా? అంటూ ఆరాలు కొనసాగుతున్నాయి. అయితే ఇది గోవానా? లేక ఇంకేదైనా విదేశీ డెస్టినేషన్ అయ్యిండొచ్చా?



అంటూ అభిమానులు డౌట్లు వ్యక్తం చేస్తున్నారు. ఇంతలోనే కీర్తి న్యూఇయర్ సెలబ్రేషన్ కం హనీమూన్ ట్రిప్ గురించి ఆసక్తికర విషయం తెలిసింది. కీర్తి సోషల్ మీడియాల్లో షేర్ చేసిన ఫోటోగ్రాఫ్స్ ని బట్టి థాయ్‌లాండ్ వెళ్లినట్టు అర్థమవుతోంది. భర్తతో కలిసి కొత్త సంవత్సరాన్ని ఎగ్జోటిక్ బీచ్ లొకేషన్ లో సెలబ్రేట్ చేసుకుంది. ఈ క్రమంలో కొన్ని ఫోటోలు, వీడియోలు అభిమానులతో షేర్ చేసుకుంది. ఈ ఫోటోగ్రాఫ్స్ చూశాక కీర్తి అద్భుతమైన పండోరా(అవతార్ సినిమాలో ఉంది) లాంటి గ్రహంపై హనీమూన్ ప్లాన్ చేసిందని అభిమానులు ప్రశంసిస్తున్నారు. కీర్తి థాయ్ బీచ్ లో సుందరమైన సముద్ర తీరాన ఫుల్ గా చిల్ చేసింది. సముద్రంలో కయాకింగ్ కూడా చేసింది. ప్రస్తుతం బీచ్ వెకేషన్ కి సంబంధించిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. గత డిసెంబర్ 24న గోవాలో బాయ్ ఫ్రెండ్ ఆంటోనీని మ్యారేజ్ చేసుకున్న కీర్తి, హిందూ- క్రిస్టియన్ స్టైల్ లో పెళ్లి చేసుకోవడం ఆసక్తిని కలిగించింది. కీర్తి పెళ్లి నుంచి చాలా ఫోటోలు వీడియోలు ఇప్పటికే వెబ్ లో వైరల్ అయ్యాయి. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే కీర్తి తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి.



# MLC ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ


హైదరాబాద్: తెలంగాణలో త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ఖరారు చేసింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు క్యాండిడేట్ల పేర్లను కాషాయ పార్టీ ప్రకటించింది. నల్గొండ-ఖమ్మం-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సరోత్తంరెడ్డి, కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేర్లను బీజేపీ ఫిక్స్ చేసింది.

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి 2025, జనవరి 10వ తేదీన అభ్యర్థుల పేర్లను అనౌన్స్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా అధికార కాంగ్రెస్, ప్రతి పక్ష బీఆర్ఎస్ పార్టీల కంటే ముందే కాషాయ పార్టీ ఎన్నికల కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే ఆ రెండు పార్టీల కంటే ముందే అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇప్పటికే బీజేపీ అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నుండి పోటీ చేసేందుకు ఆశవాహులు ఎక్కువగా ఉన్నారు. దీంతో అభ్యర్థుల ఎంపికపై అధికార పార్టీ ఆచీతూచీ వ్యవహరిస్తోంది. అన్ని సమీకరణాలను పరిగణలోకి తీసుకుని క్యాండిడేట్ల సెలక్షన్ ప్రాసెస్ చేస్తోంది కాంగ్రెస్. అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చాక.. క్యాండిడేట్ల పేర్లను కాంగ్రెస్ అనౌన్స్ చేయనున్నట్లు సమాచారం.

ఇక, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూట గట్టుకున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండనున్నట్లు పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది. బరిలోకి దిగి ఓటమి పాలు కావడం కంటే.. పోటీ చేయకపోవడమే ఉత్తమం అని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బరిలోకి దిగుతుందా లేదా అనేది తెలియాలంటే ఆ పార్టీ అధికారంగా ప్రకటిస్తే గానీ క్లారిటీ రాదు.

# అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన హైడ్రా

హైదరాబాద్, జనవరి 10: నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా (%న్ణఝ%) కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేస్తోంది. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా. దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది. నెక్నాంపూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు వెలిశాయి. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణాలు వెలిశాయి. మూడు సార్లు కూల్చివేతలు జరిగినప్పటికీ స్థానిక అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమ నిర్మాణాలను చేస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.



ఈ నేపథ్యంలో నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ విల్లాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం హైడ్రా కమిషన్ రంగనాథ్ అక్కడకు చేరుకుని నెక్నాంపూర్ చెరువుకు సంబంధించిన లేఅవుట్‌లను పరిశీలించారు. ఎంత మేరకు అక్రమాలు జరిగాయనేదానిపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత.. స్థానిక అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది. నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లపై హైడ్రా ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ శివారు నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిపై యాక్షన్ తీసుకోవాలని ఇప్పటికే హైడ్రా అధికారులకు హైడ్రా చీఫ్ కీలక ఆదేశాలు చేశారు. అందులో భాగంగానే మణికొండ నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది.


# ఇతర దేశాల్లోని నగరాలకు పోటీనిచ్చేలా ఫ్యూచర్ సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా అభివృద్ధి చేయడమే తన కల అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైటెక్ సిటీలోని సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇతర దేశాల్లోని నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. "3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి హైదరాబాద్ సిద్ధమవుతోంది. వరదలు లేని నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం తయారీ రంగానికి కేంద్రంగా ఉండబోతుంది. నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాం. రాష్ట్రానికి



తీరప్రాంతం లేదు.. అందుకే డ్రైపోర్టు ఏర్పాటు చేయనున్నాం. పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కంపెనీలు కలిసి వస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# వైకుంఠ ఏకాదశి వేడుకలు.. యాదగిరిగుట్టపై భక్తుల సందడి



యాదగిరిగుట్ట: ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని.. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెద్దఎత్తున వస్తున్న భక్తుల కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణం, ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తుల సందడి నెలకొంది.

# పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని.. ప్రేమ జంట బలవన్మరణం



సంగారెడ్డి: సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారంట్‌లో నిన్న మధ్యాహ్నం ప్రేమ జంట గదిని అద్దెకు తీసుకుంది. శుక్రవారం గది ఖాళీ చేయాల్సి ఉండగా వారు బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలు బద్దలుకొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారి తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతులను నారాయణఖేడ్ మండలం నారాయణపేట గ్రామానికి చెందిన ఉదయ్ (20), అదే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ఇరువురి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని, ఆ మనస్తాపంతోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.




# గోషామహల్‌లో మళ్లీ కుంగిన చాక్వాడి నాలా.. కూరుకుపోయిన క్రషర్ లారీ

హైదరాబాద్: గోషామహల్‌లో ప్లైవుడ్ దుకాణాల ముందు చాక్వాడి నాలా మరోసారి కుంగింది. దీంతో క్రషర్ లారీ అందులో కూరుకుపోయింది. లారీ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు. ఒకవైపు గతంలో కుంగిన నాలా పనులు చేస్తుండగా ఇప్పుడు మరో నాలా కుంగింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలా మొత్తం పునరుద్ధరించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.




# 'స్క్విడ్‌గేమ్' సూట్‌లో పొలిటికల్ లీడర్స్..

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న వెబ్‌సిరీస్‌ల్లో స్క్విడ్‌గేమ్ ఒకటి. అందులో నటీనటులంతా ఆకుపచ్చని దుస్తుల్లో దర్శనమిస్తారు. ఆ సిరీస్‌లోని పాత్రల తరహాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా వివిధ పార్టీ నేతలతో ఉన్న వీడియో నెట్టింట్లో వైరల్‌గా మారింది. గ్రీన్ సూట్‌లో వారంతా పార్లమెంట్‌కు వస్తున్నట్టుగా, సమావేశాల్లో పాల్గొన్నట్టుగా ఉంది. అలాగే స్పీకర్ ఓం బిర్లా బ్లాక్ డ్రెస్‌లో కనిపించారు. ఈ వీడియో నెటిజన్లకు నచ్చింది. చూడటానికి బాగుందంటూ వారు పోస్టులు పెడుతున్నారు. ఇదిలాఉంటే.. స్క్విడ్‌గేమ్ మొదటిభాగం సంచలనం సృష్టించగా, ఇటీవలే దీని రెండో సీజన్ (స్క్విడ్‌గేమ్2) నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై ఆకట్టుకుంటోంది. మొదటివారం అత్యధికంగా 68 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. అంతేకాదు, 92 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ ర్యాంకింగ్స్‌లో నెం.1 స్థానంలో ఉంది. దీంతో మేకర్స్ మూడో సీజన్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. రెండో భాగానికి కొనసాగింపు స్క్విడ్‌గేమ్ 3' ఉంటుందని చివరలో చూపించారు. తాజాగా దీని అప్‌డేట్‌ను కూడా పంచుకున్నారు. 'రెడ్ లైట్.. గ్రీన్ లైట్ ఆటలో కనిపించే అమ్మాయి బొమ్మతో పాటు, ఈసారి అబ్బాయి బొమ్మను కూడా పంచుకుంటూ సీజన్-3 ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకువస్తుందని ప్రకటించారు.

# బెనిఫిట్ షోలు రద్దంటూ.. ప్రత్యేక షోలకు అనుమతేంటి?: హైకోర్టు

హైదరాబాద్: 'గేమ్ ఛేంజర్' సినిమాకు టికెట్ల ధరల పెంపు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టులో విచారణ జరిగింది. తాజా పరిణామాల దృష్ట్యా ప్రత్యేక ప్రదర్శనలకు అనుమతిపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ, పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునఃసమీక్షించాలని ఆదేశించింది. ఈమేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్, ప్రత్యేక షోలకు అనుమతించొద్దని హైకోర్టు సూచించింది. నిర్మాత భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి వసూలు చేసుకోవడం సరైంది కాదని వ్యాఖ్యానించింది. ఈ విషయంపై తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది.



# అసెంబ్లీలో చెప్పింది ఒట్టిదేనా.. సీఎంపై హరీష్ రావు ఫైర్..




హైదరాబాద్, జనవరి 10: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. సీఎం తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందన్నారు. గేమ్ చేంజర్ సినిమా అదనపు షోలు వేసుకునేందుకు అనుమతి ఇవ్వడంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన హరీష్ రావు.. 'ఒక మహిళ మృతి చెందారు. ఇక మీదట సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రెడ్డి.. రెండు వారాలు కూడా తిరగకముందే ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా మాట మార్చారు' అంటూ విమర్శలు గుప్పించారు. టికెట్ రేట్లు పెంచేది లేదంటూ అదే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు సైతం స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలు అయ్యాయన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా? అని హరీష్ రావు ప్రకటించారు. అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమేనని అన్నారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతామని హరీష్ రావు ప్రకటించారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరీష్ రావు సూటిగా ప్రకటించారు.

**ఈ పాపం ప్రభుత్వానిదే..** 'గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు. మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్ తీసుకున్నారు. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి' అని హరీష్ రావు ప్రశ్నించారు.

# సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ మాస్ సెటైర్లు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ చేశారు. ఒక్క సీఎంను ఎన్నుకుంటే... ఇంకో అర డజన్ మంది ఫ్రీగా వచ్చారని ఇది తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టమని కేటీఆర్ విమర్శించారు. 1+6 ఆఫర్ సీఎం వ్యవస్థను స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడూ చూడలేదేమో అని ఆక్షేపించారు. వికారాబాద్ సీఎం తిరుపతి రెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని సెటైర్లు గుప్పిం చారు. సీఎం రేవంత్ రెడ్డికి తనది ఒక చిన్న విన్నపమని.. ప్రజాపాలన కాబట్టి ప్రజలకు మీ అనుముల సీఎంలలో ఎవరు కావాలో ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణలో IVRS పద్ధతి పెడితే బాగుంటుందేమో చూడాలని కేటీఆర్ విమర్శించారు.



# హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. 23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల కోసం హైదరాబాద్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏపీ, కర్ణాటక, యూపీ, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వీరిపై తెలంగాణలో 30, దేశవ్యాప్తంగా 328 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి సెల్‌ఫోన్లు, చెక్‌బుక్‌లు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్ డీసీపీ కవిత వెల్లడించారు. సైబర్ నేరాలు చేస్తున్న ముఠాను యూపీలో పట్టుకున్నట్లు చెప్పారు. 5 ప్రత్యేక బృందాలతో 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరు వివిధ నేరాల్లో మొత్తం రూ. 5.29 కోట్లు కాజేశారన్నారు. 5 రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. అక్కడి పోలీసుల సాయంతో అధునాతన సాంకేతికతను వాడి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు దేశవ్యాప్తంగా ట్రేడింగ్, ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారని వివరించారు. ఈ ముఠాలో ఓ మహిళ కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. "3 కేసుల్లో రూ. 39 లక్షలు స్వాధీనం చేసుకున్నాం. 70 ఏళ్ల వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఓ మహిళను అరెస్టు చేశాం. ఆమె దిల్లీలో ఎన్జీవో నడుపుతున్నట్లు గుర్తించాం. డబ్బులకు ఆశపడి నిందితురాలు ఎన్జీవో ఖాతాను సైబర్ నేరగాళ్లకు ఇచ్చింది. ఆధారాలను చూపించి ఆమెను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. ప్రజలు అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించకూడదు. వాటికి స్పందిస్తే ఖాతా నుంచి డబ్బులు పోయే ప్రమాదముంది" అని కవిత తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com